నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 23-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:120 పేజీలు:4 వెల: రూ.1/-

కొనసాగుతున్న రైతుల ఆందోళన

లేఖలతో లాభం లేదంటున్న రైతు సంఘాలు
స్పష్టమైన హామీని ఇవ్వాల్సిందే అని డిమాండ్

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళన కొనసాగతూనే ఉంది. రైతులు చల్లటి చలిని సైతం లెక్కచేయకుండా భీష్మించుకున్నారు. ఈ విషయంలో ప్రభేధత్వమే తేల్చాలని ఆందోళన చేస్తున్న రైతులు తెలిపారు. ఇకపోతే ఇటీవల ప్రధాని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ శిరస్సు వంచి, చేతులు జోడించి వేడుకుంటున్నా, ప్రభుత్వాన్ని అర్థం చేసుకోండని అన్నారు. దీన్ని బట్టి రైతుల ఉద్యమ ప్రభావం ప్రధానమంత్రిపై బలంగానే ఉన్నట్టు అనిపిస్తోంది. ఢిల్లీ పొలిమేరల్లో మూడు వారాలుగా ఉద్యమం చేస్తున్న రైతుల ఆందోళనపై దాఖలైన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు కూడా విచారణకు స్వీకరించింది. రైతుల ఉద్యమాన్ని సామరస్యంగా పరిష్కరించని పక్షంలో దేశవ్యాప్త ఉద్యమం అవుతుందని సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తంచేసింది. కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని అంతా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపాలని సుప్రీం కూడా సూచించింది. మరోవైపు వివాదస్పద వ్యవసాయ చట్టాకు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన రైతులకు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు లేఖలు రాసింది. అయితే ఆ లేఖలను 'టైంపాస్ లెటర్లు' అని రైతులు అభిప్రాయపడ్డారు. తమతో చర్చలు చేయకుండా ఈ లేఖల కాలక్షేపం ఏంటని మండిపడ్డారు. కేంద్రం రాసిన లేఖల్లో జరిగిన చర్చల గురించి మినహా మరింకేం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు, తాము డిమాండ్ చేస్తున్న అంశాలను ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. వారు మాతో నేరుగా చర్చలు జరిపితే బాగుంటుంది. అలా కాకుండా లేఖలు రాస్తున్నారు. ఆ లేఖల్లో ఇది వరకు జరిగిన చర్చలకు సంబంధించిన విషయాలు మినహా మరేం లేదు. అవన్నీ కాలక్షేపానికి రాసే ఉత్తరాలు. తాజాగా ఇచ్చిన ఐదు పేజీల లేఖలో కూడా జరిగిన చర్చలకు సంబంధించిన విషయాలే ఉన్నాయి. మేం డిమాండ్ చేస్తున్న అంశాలను వారు కనీనవ్వైనా ప్రస్తావించడం లేదని రైతుసంఘాల నేతలు అన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న నిరవధిక నిరసన 4 వారాలుగా కొనసాగుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల లక్షలాది మంది రైతులు వివాదస్పద వ్యవసాయ చట్టాల్ని ఉపసంహరించుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ తరుణంలో రైతు సంఘాల నేతలతో కేంద్ర ప్రభుత్వం పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. కనీస మద్దతు ధరపై కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇస్తామని చెప్పినప్పటికీ మూడు చట్టాల్ని పూర్తిగా ఉపసంహరించుకోవాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చెన్నై చేరుకున్న వ్యక్తికి కరోనా

క్వారంటైన్‌కు పంపిన అధికారులు

చెన్నై,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): యూకే నుంచి భారత్‌కు వచ్చిన వారిలో కొందరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడం కలకలం రేపుతోంది. యూకే నుంచి చెన్నైకి వచ్చిన ఓ వ్యక్తికి మంగళవారం నాడు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ ప్రయాణికుడు యూకే నుంచి ఢిల్లీ మీదుగా చెన్నైకి వచ్చినట్లు తెలిసింది. ఇన్‌స్టిట్యూషనల్ క్వారంటైన్‌లో భాగంగా అతనిని ఉంచి చికిత్సనందిస్తున్నారు. అతనితో కాంటాక్ట్ అయిన వారి గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. అతని శాంపిల్‌ను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి వైద్యులు పంపారు. ఆ వ్యక్తి న్యూ స్ట్రెయిన్ కోవిడ్-19 బారిన పడిందీ లేనిదీ పుణె వైరాలజీ ల్యాబ్ తేల్చనుంది. తమిళనాడు ప్రభుత్వం లండన్ నుంచి వచ్చిన వారికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు తప్పనిసరి చేసింది. ఫలితం వచ్చే వరకూ వారిని ఇన్‌స్టిట్యూషనల్ క్వారంటైన్‌లో ఉంచాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక.. యూకే నుంచి కోల్‌కత్తాకు వచ్చిన ఇద్దరు వ్యక్తులకు కూడా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిసింది. లండన్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన విమానంలో 266 మంది ప్రయాణికులతో పాటు క్రూ మెంబర్లు కూడా ఉండగా.. వారిలో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వారి శాంపిల్స్‌ను ఎన్‌సీడీసీకి పంపినట్లు కోవిడ్-19 నోడల్ అధికారి తెలిపారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి: గవర్నర్

హైదరాబాద్, డిసెంబర్ 22: భారతదేశంలో మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో మరింతగా చొరవ చూపి, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. మహిళల భాగస్వామ్యంతోనే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలం అని ఆమె అన్నారు. దేశంలో మొత్తం పారిశ్రామికవేత్తల్లో మహిళలు కేవలం 20 శాతం లోపు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు.

భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సిఎస్ఐఆర్-నీరి (సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ? నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) ల సంయుక్త ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశం 'భారత మహిళ ఎంటర్ ప్రెన్యూర్స్, సైంటిస్ట్ ల కాంక్లేవ్' గా నిర్వహించారు.

'ఆత్మ నిర్భర్ భారత్‌లో మహిళల పాత్ర' అన్న అంశంపై తమిళిసై మాట్లాడుతూ.. మహిళలకు మరిన్ని ప్రోత్సాహకాలు, ఫండింగ్, వసతుల కల్పన ద్వారా వారిని ఎంటర్ ప్రెన్యూర్స్ గా ప్రోత్సహించాలన్నారు. భారతదేశంలో దాదాపు 70 శాతం మంది మహిళలు ఆదాయం వచ్చే పనులకు దూరంగా ఉన్నారు. వీరంతా అర్థికపరమైన వర్క్ ఫోర్స్ గా మారితే దేశం దాదాపు 30 శాతం అర్థికంగా బలోపేతమవుతుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. మహిళలు ఔత్సాహికులుగా ఎదిగితే వారి కోసం అనేక ఉద్యోగాల కల్పన చేసి వారి అర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడతారు.

మొత్తం సైంటిస్ట్ ల్లో మహిళలు 14 శాతం మాత్రమే

బాలికల్లో చిన్నప్పటి నుంచే సైన్స్, పరిశోధనల పట్ల ఆసక్తి కల్గించి సైంటిస్ట్ లుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. వారు కేవలం 14 శాతం మందే ఉండటం సైన్స్, పరిశోధన, అభివృద్ధి రంగాలలో భారత్ ఎదుగుదలకు మంచిది కాదు. మహిళల్లో మరింత ఎక్కువ సైంటిస్ట్ లు తయారుకావాలి. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా,

సైంటిస్ట్ లుగా మరింత ఎక్కువ సంఖ్యలో రావడం స్వయం సమృద్ధి, స్వయం ఆధారిత భారత్ లక్ష్యసాధనలో అత్యంత కీలకమన్నారు. సమాజంలో వివక్ష తొలగాలి, కుటుంబ ప్రోత్సాహం, వనరుల కల్పన, సైన్స్ కోసం మహిళల కోసం మరిన్ని స్కాలర్ షిప్ లు, ప్రత్యేక కళాశాలలు ఈ దిశగా అవసరమని తమిళిసై అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా "భారత్ లో మహిళా సైంటిస్ట్ లు" ఈ-బుక్ ను గవర్నర్ ఆవిష్కరించారు. కేంద్ర జౌళి, మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి స్మృతి ఇరానీ, సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ శేఖర్ మాండే, నీరి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ కుమార్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ రేణు స్వరూప్, డాక్టర్ ఆధిత్య కాప్లే, ఇతర సైంటిస్ట్ లు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

కొత్త కరోనా స్ట్రెయిన్ ఎఫెక్ట్

లండన్ నుంచి వచ్చిన 8మందికి పాజిటివ్
రక్త నమూనాలను వైరాజీ ల్యాబ్‌లకు తరలింపు
కర్నాటకలో అప్రమత్తం అయిన ప్రభుత్వం

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): లండన్‌ను వణికిస్తున్న కొత్తరకం స్ట్రెయిన్ భారత్‌లోనూ ఆందోళన కలిగిస్తోంది. లండన్ నుంచి భారత్ చేరుకున్న 8మందికి కరోనా పాజిటివ్‌గా గుర్తించారు. అయితే వీరిలో ఉన్నది పాతదా లేక కొత్తదా అన్నది తేలాల్సి ఉంది. ఈ ఎనిమిది మందిలో ఢిల్లీలో 5గురికి, కోల్‌కతాలో ఒకరికి, చెన్నైలో ఇద్దరికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇది బ్రిటన్ వైరస్ అవునా కాదా అన్నది వైరాలజిస్టులు తేల్చనున్నారు. వీరి నమూనాలను వైరాలజీ టెస్టులకు పంపారు. పలు దేశాల్లో కొత్త కరోనా స్ట్రెయిన్ వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ విమానాలు, ఓడరేవుల్లో ప్రయాణికుల స్క్రీనింగ్ పెంచాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయించింది. యూకేలో కొత్త కరోనా స్ట్రెయిన్ వైరస్ ప్రబలడంతో యూకే నుంచి బెంగళూరు, మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయాలకు విమానాలు వచ్చిన నేపథ్యంలో ఆయా విమానాశ్రయాల్లో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని కర్ణాటక సర్కారు ఆదేశించింది. ఓడరేవుల్లోనూ ప్రయాణికులకు ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయాలని సర్కారు కోరింది. డిసెంబరు 7 వతేదీ నుంచి ఇప్పటివరకు వచ్చిన ప్రయాణికుల జాబితాను తీసుకొని వారిని స్క్రీనింగ్ చేయాలని సర్కారు కోరింది. సోమ, మంగళవారాల్లో వచ్చిన విమాన ప్రయాణికులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించి పాజిటివ్ వస్తే వారిని ఆసుపత్రి ఐసోలేషన్ కు తరలించాలని సర్కారు సూచించింది. కరోనా కొత్త స్ట్రెయిన్ పాజిటివ్ వస్తే వాటి శాంపిళ్లను బెంగళూరులోని పరిశోధనా కేంద్రానికి పంపించాలని అధికారులను సర్కారు ఆదేశించింది. యూకే నుంచి వచ్చిన విమాన ప్రయాణికులకు ఆర్టిపీసీఆర్ పరీక్షల్లో నెగిటివ్ అని వచ్చినా వారిని 14 రోజుల పాటు హోం క్వారంటైన్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాల అధికారులు క్వారంటైన్ ప్రయాణికులను పరిశీలనలో ఉంచాలని సూచించింది. కొత్త స్ట్రెయిన్ వేగవంతంగా ప్రబలే లక్షణాలు ఉన్నా రోగ తీవ్రత తక్కువని, అయినా కర్ణాటకలో నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సుధాకర్ వెల్లడించారు. యూకే నుంచి ఆదివారం కర్ణాటకకు 291 మంది బ్రిటీష్ ఎయిర్‌వేస్‌లో వచ్చారని, 246 మంది ఎయిర్ ఇండియాలో వచ్చారని, 138 మంది నెగటివ్ నివేదికలతో రాలేదన్నారు. వీరందరినీ వారం రోజుల పాటు హోం క్వారంటైన్‌లోనే ఉంచి నిఘా పెట్టామన్నారు. విమానాశ్రయంలో కియోస్క్‌లు అమర్చామన్నారు. వైరస్ వేగవంతంగా ప్రబలుతుందని, అయితే రోగతీవ్రత ఉండదని.. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు ఇప్పటికే కొందరు సిద్ధమైనట్లు తెలుస్తోందని, ప్రత్యేకించి హోటళ్ల బుకింగ్ చేసుకున్నా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. గడిచిన 14 రోజులుగా విదేశాల నుంచి వచ్చిన వారంతా ఆర్‌టీపీసీఆర్ టెస్ట్‌లు చేయించుకోవాలని ఆయన సూచించారు. హోం క్వారంటైన్‌ను ఉల్లంఘించినా కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్త రకం వైరస్ ప్రభావం

ముంబై చేరుకున్న వారికి వారంపాటు క్వారంటైన్

ముంబయి,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): కొత్తరకం కరోనా వైరస్ లండన్‌లో వెలుగుచూడటంతో ప్రపంచం చిగురుటాకులా వణుకుతోంది. మంగళవారం ఉదయం యునైటెడ్ కింగ్‌డమ్, మధ్యప్రాచ్య దేశాల నుంచి ముంబయికి చేరుకున్న ప్రయాణికులను అధికారులు సంస్థాగత క్వారంటైన్‌కు తరలించారు. దీనిపై బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్పందించారు. విదేశాల నుంచి వచ్చే వారిని సంస్థాగత క్వారంటైన్‌లో ఉంచుతున్నామన్నారు. ఎటువంటి లక్షణాలు కనిపించని వారు హోటల్ క్వారంటైన్‌లో ఉండాల్సి ఉంటుందని, లక్షణాలు ఉన్న వ్యక్తులను జీటీ ఆసుపత్రిలో చేరుస్తామని తెలిపారు. అయితే, ప్రభుత్వం ఈ విషయాన్ని తమకు ముందుగా తెలియజేయాల్సిందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆ కొత్త రకం కరోనాతో మనకు ముప్పేం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 22:: యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఉత్పరివర్తనం చెంది (కొత్తరూపు సంతరించుకుని) వేగంగా విస్తరిస్తున్న కొత్త రకం కరోనా వైరస్‌తో మనకు ముప్పేమీ లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. యూకే గత సెప్టెంబర్‌లో ఈ వైరస్‌ను గుర్తించగా.. ఇప్పటివరకు దేశంలో ఆ కరోనా ఉత్పరివర్తనం ఆనవాళ్లు కనిపించలేదని తెలిపింది. యూకే బయటపడ్డ ఈ కొత్త రకం కరోనా వైరస్ 70 శాతం ఎక్కువ సులువుగా సంక్రమిస్తుందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా కేసులు మరింత పెరుగుతాయనే భయాందోళనలు రేకెత్తాయి.

కానీ, మన దేశంలో మాత్రం దాని గురించి ఆందోళన చెందాల్సిన అసవరం లేదని ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్ చెప్పారు. కాగా, ఈ కొత్త వైరన్ దేశంలో ప్రవేశించకుండా కేంద్రం ఇప్పటికే యూకేకు విమానాల రాకపోకలపై తాత్కాలిక నిషేధం విధించింది. బుధవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్న ఈ నిషేధం.. ఈ నెల 31 వరకు కొనసాగనుంది. అంతకుముందు ఇప్పటికే యూకే నుంచి వచ్చిన ప్రయాణికుల కోసం కేంద్రం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక పేరుతో కీలక మార్గదర్శకాలు చేసింది.

కాగా, దేశంలో కరోనా పాజిటివ్ కేసులు ప్రస్తుతం బాగా తగ్గిపోయాయని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ చెప్పారు. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య మూడు లక్షల దిగువకు చేరిందని తెలిపారు. గత ఏడు వారాలుగా కొత్తగా నమోదయ్యే కరోనా కేసుల సగటు కూడా తగ్గిపోయిందని, రికవరీ రేటు 95 శాతం దాటిందని పేర్కొన్నారు. యూకేలో బయటపడ్డ కరోనా ఉత్పరివర్తనంతో ప్రమాదమేమీ లేని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్ చెప్పారు. ఈ వైరస్ సంక్రమణను పెంచుతుందే తప్ప వ్యాధి తీవ్రతను పెంచలేదని తెలిపారు.

కరోనా వ్యాక్సిన్ పంపిణీపై తొలగని ఉత్కంఠ

ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడానికి సన్నాహాలు

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాక్సిన్ మొదటి షిప్‌మెంట్ డిసెంబర్ చివరి వారంలో ఢిల్లీకి చేరుకొనే అవకాశాలు ఉన్నాయి. అయితే, ఈ వ్యాక్సిన్ ఎప్పటి నుంచి ఇవ్వడం మొదలుపెడతారనే అంశంపై స్పష్టత లేదు. దేశ రాజధానిలోని ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడానికి సన్నాహాలు జరుగు తున్నాయి. వారు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు టీకా షాట్లను అందిస్తారు.

ఢిల్లీలో 3,500 మంది ఆరోగ్య కార్యకర్తలకు భారీ శిక్షణా కార్యక్రమం ఇటీవలనే ప్రారంభమైంది. టీకా మోతాదుల నిల్వ కోసం న్యూఢిల్లీలో 609 కోల్డ్ చైన్ స్పాట్‌లను ఢిల్లీ ప్రభుత్వం గుర్తించింది. రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన, లోక్‌నాయక్ హాస్పిటల్, కస్తూర్‌బా హాస్పిటల్, బాబాసాహెబ్ అంబేద్కర్ దవాఖాన, జీటీబీ హాస్పిటల్, మొహల్లా క్లినిక్స్ లను అతిపెద్ద టీకా డ్రైవ్ కోసం కోల్డ్ స్టోరేజ్ చైన్లుగా ఉపయోగించబడతాయి. ఆరోగ్య కార్యకర్తల శిక్షణా కార్యక్రమానికి మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ (ఎంఏఎంసీ) కి చెందిన ముగ్గురు వైద్యులను 'టీకా అధికారులు' గా ఎంపిక చేశారు. వారు టీకాలు వేసే తీరుపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తారు. ఇక్కడ శిక్షణ పొందినవారు దేశ రాజధానిలోని ఇతర జిల్లా స్థాయి ఆరోగ్య కార్యకర్తలకు నేర్పుతారు. ప్రతి కోల్డ్ చైన్ పాయింట్ వద్ద ఆరుగురితో కూడిన టీకా అధికారుల బృందం మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని, కోల్డ్ చైన్ పాయింట్‌కు కనీసం 3 గదులు అవసరం అవుతాయిన ఎంఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ డాక్టర్ ప్రజ్ఞాశర్మ తెలిపారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌పీఎస్‌సీ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని బీజేవైఎం నాయకులు ముట్టడించారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు టీఎస్‌పీఎస్‌సీ ముందు బైఠాయించారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. కొద్ది రోజుల క్రితం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే నియామకాలు చేపట్టాలని బీజేవైఎం డిమాండ్ చేసింది. అలాగే ప్రభుత్వం ఎన్నికల హామీలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిందని.. ఇంతవరకు అమలు చేయలేదని, వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కమిషన్‌కు ఛైర్మన్ ,సభ్యులను నియమించాలని కోరారు.

దేశంలో 12852 చిరుత పులులు.. ప్రధాని మోదీ హర్షం

హైదరాబాద్, డిసెంబర్ 22: భారత్‌లో చిరుత పులుల సంఖ్య పెరుగుతున్నది. ఈ విషయం పట్ల ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఇదో గొప్ప న్యూస్ అని ఆయన అన్నారు. దేశంలో చిరుత పులల సంఖ్య 12,852కు చేరినట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. ఈ వార్త పట్ల ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో రియాక్ట్ అయ్యారు. గ్రేట్ న్యూస్, సింహాలు, పులుల తర్వాత చిరుతల సంఖ్య పెరిగినట్లు ఆయన చెప్పారు. జంతువుల సంరక్షణ కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికీ ఆయన కంగ్రాట్స్ చెప్పారు. ఇలాంటి ప్రయత్నాలనే ఎప్పటికీ కొనసాగించాలని, సురక్షితమైన పరదేశాల్లో జంతువులు ఉండేలా చూడాలన్నారు. 2014లో దేశంలో కేవలం 7910 మాత్రమే చిరుత పులులు ఉండేవి. అయితే 60 శాతం కన్నా ఎక్కువ జనాభా రికార్డు అయ్యింది. మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల్లో చిరుతల సంఖ్య ఎక్కుగా ఉంది.

వైరస్ మ్యుటేషన్‌ను నియంత్రించే టీకా

త్వరలోనే రూపొందిస్తామన్న జర్మన్ ఫార్మా

బెర్లిన్ ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): జర్మనీకి చెందిన బయోఎన్‌టెక్ ఫార్మా సంస్థ కీలక ప్రకటన చేసింది. కరోనా వైరస్ మ్యుటేషన్‌ను అడ్డుకునే టీకాను త్వరలో రూపొందించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఆరు వారాల్లోగా కరోనా వైరస్ మ్యుటేషన్‌ను నియంత్రించే టీకాను ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పింది. అమెరికాకు చెందిన ఫైజర్ కంపెనీతో కలిసి బయోఎన్‌టెక్ సంస్థ.. కరోనా వైరస్ టీకాను ఇటీవల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆ టీకాను పలు దేశాల్లో పంపిణీ చేస్తున్నారు. అయితే తాజాగా బ్రిటన్‌లో కొత్త రకం కరోనా వైరన్ ప్రబలుతున్న నేపథ్యంలో.. బయోఎన్‌టెక్ సంస్థ ఇవాళ కీలక ప్రకటన చేసింది. నోవెల్ కరోనా వైరస్ కేసులు ప్రారంభం అయిన నాటి నుంచి కూడా మ్యుటేషన్ చెందుతున్నట్లు శాస్త్రవేత్తలు అంగీకరించిన విషయం తెలిసిందే. తాము తయారుచేయబోయే కొత్త రకం టీకా .. కరోనా పరివర్తనలను అడ్డుకునే రోగనిరోధక వ్యవస్థను సృష్టిస్తుందని ఉగురు సాహిన్ తెలిపారు. మెసెంజర్ టెక్నాలజీతో మ్యుటేషన్ అడ్డుకునే టీకాలను సృష్టిస్తామన్నారు.

ఆగ్రా హైవేపై రోడ్డు ప్రమాదం

కారును ఢీకొన్న ట్రాక్టర్..ఐదుగురు సజీవదహనం

లక్నో,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): వేగంగా వస్తున్న కంటెయినర్ ట్రక్కు కారును ఢీకొన్న ప్రమాదంలో మంటలు రేగి ఐదుగురు కారులోనే సజీవ దహనం అయ్యారు.

ఈ ఘటన ఆగ్రా నగరంలోని ఎక్స్‌ప్రెస్ హైవేపై మంగళవారం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున కంటెయినర్ ట్రక్కు రాంగ్ డైరెక్షన్ లో వస్తూ కారును ఢీకొట్టింది. దీంతో కారులో మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న ఐదుగురు వ్యక్తులు సజీవదహనమయ్యారు. కారులో ఉన్న వాళ్లు సహాయం కోసం అరిచారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. నాగాలాండ్‌కు చెందిన ట్రక్కు వ్యతిరేక డైరెక్షన్‌లో వస్తూ కారును ఢీకొట్టింది. లక్నో నుంచి ఢిల్లీకి కారులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి సహాయ చర్యలు చేపట్టారు.

ప్రధాని మోడీకి ప్రతిష్ఠాత్మక అమెరికా అవార్డు

అవార్డును స్వీకరించిన భారత రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధు

వాషింగ్టన్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డు చేరింది. అమెరికా సైన్యం అందించే అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన 'లెజియన్ ఆఫ్ మెరిట్'ను మోదీకి ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం బహూకరించారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ ఓబ్రయాన్ చేతుల మీదుగా.. మోదీ తరఫున అమెరికాలోని భారత రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధు ఈ అవార్డును స్వీకరించారు.

భారత్-అమెరికా వ్యూహాత్మక బంధాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మోదీ చూపిన చొరవకుగానూ ఆయనకు ఈ అవార్డు బహూకరించినట్లు ఓబ్రయాన్ తెలిపారు. దీంతో ఈ అవార్డు కింద దేశాధినేతలకు ఇచ్చే చీఫ్ కమాండర్ హోదా మోదీని వరించింది. మోదీతో పాటు ఈ అవార్డును ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్, జపాన్ మాజీ ప్రధాని షింజో అబేకూ బహూకరించారు. సైన్యంతో పాటు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాల బలోపేతానికి కృషి చేసిన దేశాధినేతలకు అమెరికా ఈ అవార్డును అందిస్తుంటుంది. మోదీకి గతంలోనూ పలు దేశాల ఆయా దేశాల అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయి. 2016లో సౌదీ అరేబియా.. అబ్దులాజిజ్ అల్ సౌద్ అవార్డు, అఏ÷-గానిస్థాన్ నుంచి అమీర్ అబ్దుల్లా ఖాన్ అవార్డు, సియోల్ పీస్ ప్రైజ్-2018, రష్యా నుంచి ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోజిల్ అవార్డు, యూఏఈ నుంచి జాయెద్ మెడల్‌ను అందుకున్నారు.

వైద్యులే నిజమైన దేవుళ్లు : మంత్రి ఈటల



పెద్దపల్లి : ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగుల పాలిట వైద్యులే దేవుళ్లని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఎల్ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్ట్, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దొంగతుర్తి ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా ఉచిత వైద్య శిబిరానికి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాన్ని నిర్వహించటం ఎంతో అభినందనీయమన్నారు.

ప్రతిమ ఫౌండేషన్, కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ ఇలాంటి సేవా కార్యక్రమాల్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత,జడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎల్ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ కొప్పుల స్నేహలత, ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ చెన్నమనేని వికాస్, డాక్టర్ దీప, రాంచందర్ రావు, ప్రేమ్ సాగర్ రావు, గ్రామ సర్పంచ్ పాలకుర్తి సత్తయ్య, జెడ్పీటీసీ పుస్కురి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కిసాన్ దివస్.. రైతు ఆందోళనలకు పరిష్కారం చూపేనా !

నేటినిజం
బుధవారం 23-12-2020

హైదరాబాద్, డిసెంబర్ 22:కిసాన్ దివస్..ఫార్మర్స్ డే...దివంగత ప్రధాని చౌధురి చరణ్ సింగ్ జయంతిని దేశం జరుపుకుంటున్న వేళ ఢిల్లీలో రైతుల సమస్యలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఎంతకాలం పడుతుందో చెప్పడం కష్టం. ఎందుకంటే మొత్తం చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్ నుంచి రైతులు దిగిరావడం లేదు. ఏటా చరణ్ సింగ్ జయంతిని కిసాన్ దివస్‌గా జరుపుకుంటాం. డిసెంబర్ 23న కిసాన్ దివస్ జరుగనుంది. ఈ దశలో రైతుల సమస్యలకు పరిష్కారం దొరకాలని దేశం యావత్తూ కోరుకుంటోంది. విపక్షాలు కూడా రైతుల ఆందోళనలో చలిమంటలు కాచుకుంటున్నాయి తప్ప తమ కార్యాచరణకు సంబంధించి పరిష్కారం చూపడం లేదు. రైతుల భుజాలపై తుపాకి ఎక్కుపెట్టిన విపక్షాల లక్ష్యం మోడీ తప్ప రైతుల సమస్యలు కాదని తేలిపోయింది. దాదాపు నెలరోజులుగా ఆందోళనలు చేస్తున్న రైతులతో చర్చించి సమస్యలకు పరి ష్కారం ఆలోచించడం లేదు. ప్రజాస్వా మ్యంలో ఆందోళనలు చేయడమే కాదు.. పరిష్కారం కూడా ఉండాలి. మహాత్మా గాంధీ అద్వర్యంలో జరిగిన భారత స్వాత ంత్ర్యోద్యమంలో పాల్గొన్న చౌధురీ చరణ్ సింగ్ తన జీవితాంతం రైతుగానే జీవిం చాడు. రైతుల సమస్యలపై పోరాడారు.

1950లలో ఉత్తరప్రదేశ్‌లోని అప్పటి ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లబ్‌పంత్ పర్యవేక్షణలో భారతదేశం లో ఏ రాష్ట్రంలోనూ జరగని అత్యంత విప్లవాత్మక భూ సంస్కరణల చట్టాలను రూపొందిం చడంలోను, వాటిని ఆమోదించడంలోనూ చరణ్ సింగ్ మంచి గుర్తింపు పొందాడు. మొదట పార్లమెంటరీ సెక్రటరీ గాను, తరువాత భూసంస్కరణలకు బాధ్యత వహించే రెవెన్యూ మంత్రిగాను అతను ఈ కార్యాలను సాధించాడు.

1959లో భారతదేశంలో తిరుగులేని నాయకుడు, భారత ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సామ్యవాద, సముదాయవాద భూ విధానాలను నాగపూర్‌లోజరిగిన కాంగ్రెస్ సెషన్‌లో బహిరంగంగా వ్యతిరేకించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాడు.

వర్గాలుగా విడిపోయి ఉన్న ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్‌లో తన స్పష్టమైన విధానాలు, విలువలను స్పష్టం చేయగల సామర్థ్యాల కారణంగా అతను ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఆయన జయంతికి ముందు మూడువారాలుగా రైతులు ఆందోళనలు చేస్తున్న తీరు గమనార్హం.

కొత్త వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ లక్షలాది మంది రైతులు దేశ రాజధానిలోకి ప్రవేశించి తమ గొంతువినిపించాలని ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయరంగ సమస్యలను పరిష్కరించే దాకా బైఠాయించ డానికి పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతాంగం చలో ఢిల్లీ పిలుపునిచ్చింది. వారికి సంఘీభావంగా దేశంలోని అనేక ప్రాంతాల నుంచి రైతాంగ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు కూడా రాజధాని చేరుకుని చల్లటి చలిలో తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. మరొకవైపు చట్టాలతో రైతులకు మేలని అంటూ ప్రధాని పదేపదే విన్నవిస్తున్నారు. రైతుల పిలుపుమేరకు ఇటీవలే జరిగిన సమ్మెకు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్ర రాజధానులలో ఊరేగింపులు, ర్యాలీలూ జరిగాయి.

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ, ప్రపంచమార్కెట్‌కు అంగడిసరుకుగా మార్చారన్నది ప్రధాన ఆరోపణగా రైతులు ఆందోళన చేస్తున్నారు.

వివాదాస్పదమైన మూడు కేంద్ర వ్యవసాయ చట్టాలపై ప్రధానంగాను, ఇతర రైతాంగ సమస్యలపైనా రైతాంగం ఆగ్రహంతో ఉంది. కొత్తగా చేసిన వ్యవసాయ చట్టాలు రైతులకు గిట్టుబాటు ధర అవకాశాలను దెబ్బతీస్తాయని, వ్యవసాయంపై కార్పొరేట్ల ఆధిపత్యాన్ని నెలకొల్పుతాయని రైతాంగం ఆందోళన చెందుతోంది. వ్యవసాయ చట్టాల దుష్ఫలితాల నుంచి రక్షణ కోసం విస్పష్టమైన హామీ ప్రభుత్వం నుంచి లభిస్తే తప్ప, రైతులు ఢిల్లీ నుంచి కదలరని నిరసనకారులు విస్పష్టంగా చెప్పేస్తున్నారు.

ఈ దశలో సమస్యకు పరిష్కారం కనుగొనాల్సిన ఆశ్యకత ప్రభుత్వపై ఉంది. అలాగే విపక్షాలపైనా ఉంది. దేశమంతటికీ వర్తించే చట్టాలకు కేవలం కొన్ని ప్రాంతాల నుంచే వ్యతిరేకత ఎందుకు వ్యక్తమవుతున్నదన్న ప్రశ్న కూడా ఉదయిస్తోంది. నిజానికి, ఈ చట్టాల గురించిన ముందస్తు చర్చ ఏదీ దేశంలో జరగలేదు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్ యంత్రాంగాలు ఒకేరకంగా లేవు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కొత్త చట్టాలలోని నిబంధనలు పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కొన్ని చోట్ల మద్దతు ధరలు, ప్రభుత్వ మార్కెటింగ్ వ్యవస్థలపై ఇప్పటికే నిస్పృహతో ఉన్న రైతులు ఈ చట్టాలు తమకు శరాఘాతంగా భావిస్తున్నారు. నిర్దిష్ట పరిస్థితులలో చట్టాలలోని అంశాల వర్తింపు ఎట్లా ఉన్నప్పటికీ, చట్టాల సారాంశం మాత్రం యావత్ వ్యవసాయరంగానికి వివాదాస్పదమైన భవితవ్యాన్ని అందించేదే. పంజాబ్‌లో మాత్రం అక్కడి మండీవ్యవస్థ ద్వారానే 90నుంచి-95 శాతం పంట విక్రయాలు జరుగుతాయి. మద్దతు ధర అక్కడ కీలకం. రైతులు తమ ఫలసాయాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చునంటున్న చట్టం, రైతును వ్యాపారిని సమాన స్థాయిలో నిలిపే హామీ ఏమీ ఇవ్వడం లేదన్నది ప్రధాన ఆందోళనగా కనిపిస్తోంది. ప్రభుత్వం భరోసా ఇచ్చే వ్యవస్థ పోయి, మార్కెట్‌శక్తులకే ధరల నిర్ణయాన్ని వదిలేస్తే, అది అంతిమంగా రైతునే నష్టపరుస్తుందని అంటున్నారు. ఇప్పటికే నష్టపోతున్న వ్యవసాయదారుడు మరింత అధికంగా నష్టపోతాడు. నాలుగు నెలల నుంచి పంజాబ్, హర్యానా రైతులు వ్యక్తం చేస్తున్న నిరసనలు, చివరకు రాజధానికి చేరడంతో పరాకాష్ఠకు చేరాయి. లాఠీలు ఝుళిపించినా, నీటి ఫిరంగులు మోగినా రైతుల సంకల్పం సడలలేదు. సమస్య తేలేవరకు ఢిల్లీ వదిలివెళ్లబోమని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. ఈ దశలో రైతులు తమ ఆకాంక్షలను ఏ మేరకు నెరవేర్చుకోగలరన్నది కూడా స్పష్టత లేని విషయమే. వ్యవసాయ చట్టాలపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్న రాజకీయ పార్టీలు చల్లగా జారుకున్నాయి. మరోవైపు ఆందోళనలో పాల్గొంటున్న రైతుల్లో ఎక్కువమంది నిఖార్సయిన రైతులు కారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ దశలో చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని కిసాన్ దివస్‌ను రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించుకుంటు మంచిది. ఈ రోజు సమస్య పరిష్కారం అయితే మరీ మంచిది. ఇది ఆయనకు నివాళిగా భావించవచ్చు.

రంగనాయక్ సాగర్‌ను సందర్శించిన ఐఏఎస్‌లు

సిద్దిపేట,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలోని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను సోమవారం ఐఏఎస్ అధికారులు ఎన్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ హరిప్రీత్‌సింగ్, రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్ సందర్శించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి ఏఐఎస్ అధికారులు రిజర్వాయర్ సొరంగంతో పాటు బండ్, డెలివరీ సిస్టమ్, గెస్ట్‌హౌస్, ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. రిజర్వాయర్ పనితీరును ఇరిగేషన్ అధికారులు ఐఏఎస్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీఈ రమేశ్, జేఈ ఖాజా, ఇరిగేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

మంత్రి సబితకు నిరసన సెగ

క్రిస్మస్ కానుకలను అందించిన మంత్రి

హైదరాబాద్,డిసెంబర్21(ఆర్ఎన్ఎ): మంత్రి సబితాఇంద్రారెడ్డికి అడుగడుగునా నిరసనలు తగులుతున్నాయి. తాజాగా మీర్ పేట కార్పొరేషన్ 9 డివిజన్ లో బీటీ రోడ్డు ప్రారంభానికి వెళ్లిన మంత్రికి నిరసన సెగ తగిలింది. గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఏవీ పూర్తికాలేదని స్థానికులు అడ్డుకున్నారు. స్వయంగా మంత్రి సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా స్థానికులు, కాలనీవాసులు వినలేదు. దీంతో బీటీ రోడ్డును ప్రారంభించకుండానే వెనుదిరిగింది. 9వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ శివపార్వతి అనుచరులు సైతం మంత్రి సబితా కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు టీఆర్ఎస్ పార్టీ తొత్తులుగా మారి బీజేపీ కార్పొరేటర్ల పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్ లో ఇలాంటి పరిణామాలు తలెత్తితే ఎక్కడికక్కడ మంత్రి సబితమ్మను అడ్డుకుంటామని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రంలోని అన్ని మతాలను ప్రభుత్వం సమానంగా గౌరవిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లాలోని బొంరాస్‌పేట మండలంలోని మెట్లకుంటలో క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం అందించిన క్రిస్మస్ దుస్తులు, మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ పండుగలకు ప్రభుత్వం ఉచితంగా బట్టలు పంపిణీ చేస్తుందన్నారు. పేదలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. పేద ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం చేసి ఆదుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమాబాయి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్ జ్యోతి పాల్గొన్నారు.

రైతువేదికలతో అన్నదాతలకు మేలు: కొప్పుల

జగిత్యాల,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషిచేయడంతో పాటు క్లస్టర్ లో రైతులు ఏ పంటలను సాగు చేయాలి, పంటను సాగు చేయడం ద్వారా కలిగే లాభనష్టాలు, మార్కెట్ సౌకర్యాలు వంటి భవిష్యత్ నిర్ణయాలకు అధ్యయన కేంద్రాలుగా రైతువేదికలు నిలుస్తాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏక్కడ రైతులు అభివృద్ధి చెందుతారో, ఆ దేశం కూడా అభివృద్ధి చెందుతుందని విశ్వసించి, మొట్టమొదటిసారి వ్యవసాయాభివృద్ధికి కొంగోత్త అలోచనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని అభివర్ణించారు.

అంబానీల జేబులు నింపడానికే చట్టాలు

-ఆదిలాబాద్ ధర్నాలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): అంబానీలు, అదానీల జేబులు నింపడానికే వ్యవసాయ చట్టాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఎదుట కాంగ్రెస్ ధర్నా నిర్వహించింది. ఫసల్ భీమా పరిహారం కోసం చేపట్టిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నమ్మించి మోసం చేస్తున్నాయని... దేశంలో పెద్ద మోడీ... రాష్ట్రంలో చిన్న మోడీ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని మండిపడ్డారు. కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ చట్టాలతో... రైతులను కొట్టి ప్రైవేట్ గద్దలకు పెడుతుందన్నారు. రైతులు మద్దతు ధర ఇవ్వమని డిమాండ్ చేస్తుంటే దేశంలో ఎక్కడైనా పంట అమ్ముకోవచ్చని చెప్పడం సిగ్గు చేటని ఫైర్ అయ్యారు. మద్దతు ధరనే దక్కకపోతే రైతు ఎక్కడ అమ్ముకున్న ఒక్కటేన్నారు. పంజాబ్ రైతుల పోరాటం అందరూ ఆదర్శంగా తీసుకోవాలని.... గడ్డ కట్టే చలిలో వ్యవసాయ చట్టాల రద్దుకు రైతులు చేస్తున్న పోరాటం దేశ సైనికుల పోరాటంతో సమానమని కొనియాడారు. రైతులను మోసం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందేనన్నారు... రైతు బంధు, రైతు మాఫీ పేరుతో రాష్ట్రంలో అన్నదాతలను కేసీఆర్ బురిడి కొట్టించి ఓటు బ్యాంకుకు వాడుకుంటున్నారని మండి పడ్డారు.

భారత్ కోవిడ్ 19 వ్యాక్సిన్లను అన్నిదేశాలకు ఉత్పత్తి చేయగలదు

-భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,డిసెంబర్21(ఆర్ఎన్ఎ): భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల మాట్లాడుతూ, తన ప్రజల అవసరాల కోసం కో వి డ్-19 వ్యాక్సిన్ లను ఉత్పత్తి చేయడానికి మరియు భారతదేశం యొక్క సహాయం అవసరమైన ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి దేశం తగినంత సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు. ఆరోగ్య మౌలిక సదుపాయాల్లో భారతదేశం మరింత పెట్టుబడులు పెట్టాలని మరియు ఈ రంగంలో మరింత ప్రైవేటు భాగస్వాములను పొందాల్సి ఉందని, మహమ్మారి తరువాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు దేశం ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎఫ్ ఎం పేర్కొంది. రష్యా కు చెందిన స్పుత్నిక్ వి కరోనావైరస్ వ్యాక్సిన్ల 300 మిలియన్ మోతాదులను వచ్చే ఏడాది ఉత్పత్తి చేయాలని భారత్ నిర్ణయించిందని రష్యా అధికారి ఒకరు తెలిపారు. ఈ కొత్త సంఖ్య ఇంతకు ముందు తెలిసిన పరిమాణంకంటే మూడు రెట్లు ఎక్కువగా తయారీదారులతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఒక వార్తా సంస్థ పేర్కొంది. భారత్ లో ఉత్పత్తి అయిన స్పుత్నిక్ వి తొలి నమూనాలను పరీక్షించడంలో రష్యా నిమగ్నమైందని, తమ వ్యాక్సిన్ జార్ కిరిల్ డిమిత్రియేవ్ ను ఉటంకించిన వార్తా కథనాన్ని శుక్రవారం న్యూఢిల్లీలోని దాని దౌత్య కార్యాలయం ట్విట్టర్ లో పేర్కొంది.

టెక్నాలజీ వినియోగంతో గంటల వ్యవధిల్లోనే నిందితులను గుర్తిస్తున్నాం

కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్. డిసెంబర్ 22 (నేటినిజం ప్రతినిధి): అత్యాధునిక టెక్నాలజీ వినియోగంతో ఎలాంటి నేర సంఘటన జరిగినా నిందితులను కొన్ని గంటల వ్యవధిల్లోనే గుర్తిస్తున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. వివిధ రకాల నేరాల్లో నిందితులను గుర్తించేందుకు అవసరమైన అత్యాధునిక టెక్నాలజీ వినియోగం సౌలభ్యం కమిషనరేట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

కమిషనరేట్‌వ్యాప్తంగా ఏచిన్న నేరం జరిగినా ఛాలెంజ్‌గా తీసుకుంటూ చేధించేందుకు ఏర్పరుచుకున్న ప్రత్యేక సమాచార వ్యవస్థ, టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగుతున్నామని చెప్పారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన పోలీస్ కమిషనరేట్ నుండి టెక్నాలజీ వినియోగం మారుతున్న కాలానికనుగుణంగా అందుబాటులోకి వస్తున్నదని, అభివృద్ధి చెందిన దేశాల్లో కొనసాగిస్తున్న అత్యాధునిక టెక్నాలజీ సౌకర్యాలు కూడా కమిషనరేట్‌లో వినియోగించబోతున్నామని తెలిపారు. ఇప్పటికే వివిధ రకాల టెక్నాలజీలను వినియోగించడడం జరుగుతోందని, దీంతో నేరాలను వేగవంతంగా చేధిస్తున్నామని చెప్పారు. ఏర్పరుచుకున్న ప్రత్యేక సమాచార వ్యవస్థ, టెక్నాలజీ వినియోగంతో నిందితులను కొన్నిగంటల వ్యవధిల్లోనే గుర్తించబడుతున్నా వారిని పట్టుకునేందుకు క్రైంబృందాలు ఇతరజిల్లాలు, రాష్ట్రాలకు వెళ్ళి నిందితులను పట్టుకునేందుకు గాలింపులను కొనసాగిస్తున్నాయని తెలిపారు. వివిధ రకాల నేరాల చేధనలో భాగంగా నిందితులను పట్టుకునేందుకు వివిధ విభాగాలకు చెందిన పోలీసులు కుటుంబాలకు దూరంగా ఉంటూ రేయింబవళ్ళు శ్రమిస్తున్నారని, నేరాల చేధనపై వారు కనబరుస్తున్న ఆసక్తి, వృత్తిపట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. కమిషనరేట్ ఏర్పాటుకుముందు టెక్నాలజీ సౌకర్యాలు అంతగా అందుబాటులో లేవని, టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగుతుండటం వల్లనే నిందితులు పట్టుబడి, న్యాయస్థానాలు శిక్షలు విధిస్తుండటంతో జైల్లోనే ఉంటున్నారని దీంతో అనేక రకాల నేరాలు నియంత్రణలోకి వచ్చాయని వివరించారు. కమిషనరేట్ ఏర్పాటుకు ముందు కరీంనగర్‌లో ప్రధానరోడ్లపై కూడా సిసి కెమెరాలు లేవని, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న

అవగాహన కార్యక్రమాలతో అన్నివర్గాల ప్రజలు చైతన్యవంతులై సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకువస్తున్నారని దీంతో కమిషనరేట్ వ్యాప్తంగా ప్రస్తుతం సిసి కెమెరాల సంఖ్య 10వేలకు చేరువలో ఉందని పేర్కొన్నారు.

కమిషనరేట్‌లోని ప్రతిగ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటు

కరీంనగర్ కమిషనరేట్‌లోని ప్రతి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. నేరాల నియంత్రణ,చేధనలో సిసి కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఏ నేరసంఘటన జరిగినా నిందితులు, అనుమానితులను కొన్నిగంటల వ్యవధిల్లోనే గుర్తించేందుకు ఈ కెమెరాలు దోహదపడుతాయని చెప్పారు. కమిషనరేట్‌లోని 10 పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మిగతా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రతిగ్రామంలోకూడా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం మన భద్రతకోసమే అన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించాలని చెప్పారు. సిసి కెమెరాల ఫుటేజీల ఆధారంగానే ఈమధ్యకాలంలో అనేక నేరాలను చేధించడం జరిగిందని తెలిపారు. కొన్నిసాంకేతిక లోపాలకారణంగా పనిచేయని కెమెరాలకు మరమ్మత్తులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు సిసి కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. సిసి కెమెరాల ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కెమెరాల ఏర్పాటులో నాణ్యత, ప్రమాణాల విషయంలో రాజీపడోద్దని పేర్కొన్నారు. ప్రతి గ్రామ, రోడ్ల ప్రవేశ, బయటకు వెళ్ళే ప్రాంతాల్లో నాణ్యతగలకమ్యూనిటి సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కెమెరాల్లో నిక్షిప్తం కాబడిన దృశ్యాలు కనీసం 30రోజులు భద్రపరిచేలా ఉండాలని సూచించారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

వందమంది జమకూడే ప్రతిచోట కెమెరాలు ఏర్పాటు

ప్రతి వందమంది జమకూడే ప్రాంతంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చట్టం నిర్దేశిస్తోందని, సినిమాహాళ్ళు, ఫంక్షన్‌హాళ్ళు, హాస్పిటళ్ళు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, బార్‌అండ్‌రెస్టారెంట్లు, వైన్‌షాపులు, హోటళ్ళు, లాడ్జ్‌లు, విద్యాసంస్థలు, హాస్టళ్ళు, పరిశ్రమలు, మాల్స్, జిన్నింగ్ మిల్స్, పెట్రోల్‌బంక్‌లు,ప్రార్థనాస్థలాలు, అపార్ట్‌మెంట్లు,కోచింగ్‌కేంద్రాలు, జువెల్లరిషాపులు, మొబైల్‌ఫోన్లషోరూంలు, పేలుడుపదార్థాలు నిల్వఉంచే ప్రాంతాలు, సూపర్‌మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల ప్రాంతాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సిసి కెమెరా దృశ్యాలను కమాండ్ కంట్రోల్‌నకు అనుసంధానం చేస్తున్నామని తెలిపారు.

క్రిస్మస్ రోజున రైతుల అకౌంట్లలో పీఎం కిసాన్ యోజన నగదు జమ

మొదటి విడత పీఎం కిసాన్ యోజనను ప్రధాని మోదీ విడుదల

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): క్రిస్మస్ పండుగ రోజున దేశంలోని రైతుల బ్యాంకు అకౌంట్లలో పీఎం కిసాన్ యోజన పథకం నగదును జమ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దాదాపు 80 మిలియన్ల మంది రైతులకు రూ.18,000 కోట్ల విలువైన చెల్లింపులు చేయనున్నారు. క్రిస్మస్ రోజున రైతులతో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడిన అనంతరం ఈ మొత్తాన్ని విడుదల జమచేయనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది.2019 లో మొదటి విడత పీఎం కిసాన్ యోజనను ప్రధాని మోదీ విడుదల చేశారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలను వెనక్కి తీసుకోవాలంటూ దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు ఆందోళన చేస్తున్న సమయంలోనే ప్రధాని మోదీ.. పీఎం కిసాన్ యోజన నిధులను రైతుల అకౌంట్లలో వేయాలని చూడటం విశేషం.ఈ సందర్భంగా రైతులతో ప్రధాని కొంత సేపు మాట్లాడతారని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు కొత్త వ్యవసాయ చట్టాల గురించి, అవి రైతులకు ఎలా మేలు చేస్తాయో ప్రధాని మాట్లాడే అవకాశం ఉన్నదని వారు పేర్కొన్నారు. పీఎం కిసాన్ యోజన పథకంలో భాగంగా చెల్లుబాటు అయ్యే సమాదైన రైతులకు ప్రభుత్వం ఏటా రూ.6,000 ఆదాయ మద్దతును అందిస్తున్నది. ప్రతి నాలుగు నెలలకొకసారి మూడు సమాన నగదు బదిలీలలో రూ.2,000 చెల్లిస్తున్నారు. మొదటి విడతగా 2019 ఫిబ్రవరి 24 న ప్రారంభించబడింది. ఈ పథకం ద్వారా ఎలా ప్రయోజనం పొందుతున్నారనే దానిపై ప్రధానమంత్రి రైతులతో సంభాషించనున్నారు. రైతుల సలహాలు, సూచనలు తీసుకొని రానున్న బడ్జెట్‌లో మార్పులు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది.

కెరీర్ చివరల్లో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు

ఏపీ ప్రభుత్వంపై హైకోర్టు జడ్జి సంచలన వ్యాఖ్యలు

మిషన్ బిల్డ్ ఏపీ కేసుపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాకేష్ కుమార్ వైసీపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కెరీర్ చివరల్లో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదని వ్యాఖ్యానించారు. మిషన్ బిల్డ్ ఏపీపై దాఖలైన పిటిషన్ల మీద విచారణ నుంచి జస్టిస్ రాకేష్ కుమార్ తప్పుకోవాలని ఏపీ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై జస్టిస్ రాకేష్ కుమార్ స్పందించారు. మిషన్ బిల్డ్ ఏపీ పిటిషన్‌పై తాను విచారణ కొనసాగించాలో, విచారణ నుంచి తప్పుకోవాలనేది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారని జస్టిస్ రాకేష్ కుమార్ తేల్చి చెప్పారు. రాగద్వేషాలకు అతీతంగా వ్యవస్థ కోసం తాను పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 28న విచారణ చేస్తానని ఆయన చెప్పారు. తన కెరీర్ చివర్లో ఇలాంటి పిటిషన్ చూస్తాననుకోలేదని ఓకింత భావోద్వేగం చెందారు.మిషన్ బిల్డ్ ఏపీ పథకం కింద ప్రభుత్వ భూములను విక్రయించాలని జగన్ సర్కార్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని గుంటూరు, విశాఖపట్నంతో పాటు 9 ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను ఈ వేలం ద్వారా విక్రయించాలని సర్కార్ నిర్ణయం తీసుకొంది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రాకేష్ కుమార్.. ప్రభుత్వ తీరుపై కీలక ప్రశ్నలు సంధించారు. ఈ తరుణంలో విచారణ నుంచి జస్టిస్ రాకేష్ కుమార్ తప్పుకోవాలని ఏపీ ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో జస్టిస్ రాకేష్ కుమార్ కెరీర్ చివర్లో ఇలాంటి పిటిషన్ చూస్తాననుకోలేదని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన జస్టిస్ రాకేష్ కుమార్ రిటైర్డ్ కాబోతున్నారు.

రూ.7 లక్షల కోట్లు హాంఫట్

భారీ నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు

కొత్త వైరస్ భయంతో డీలా పడ్డ మార్కెట్లు

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం అత్యంత భారీ నష్టాన్ని చవిచూశాయి. బ్రిటన్‌లో వెలుగులోకి వచ్చిన కొత్తరకం వైరస్ భయంతో మే 4 అనంతరం సోమవారం ప్రపంచ వ్యాప్తంగా అత్యల్ప రికార్డును నెలకొల్పాయి. సెన్సెక్స్ 2,037.61 పాయింట్లు లేదా 4.34 శాతం క్షీణించి 44,923.08 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 629.1 పాయింట్లు, 4.57 శాతం పడిపోయి 13,131.45 బెంచ్‌మార్క్‌కు చేరింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు, ఆటోమొబైల్, మెటల్ రంగంలో అమ్మకాలు పడిపోవడంతో మార్కెట్‌లో పేర్ల విలువ తగ్గిపోయింది. ఇటీవల బ్రిటన్‌లో వెలుగులోకి వచ్చిన ఈ కొత్త వైరస్ అసలు కంటే 70 శాతం అధికంగా వ్యాప్తి చేయగలదని వెల్

రెండు రోజుల్లో పెళ్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): మరో రెండు రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడి జీవితం అర్ధాంతరంగా ముగిసింది. పెళ్లి చేసుకోబోయే అమ్మాయి ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో కాబోయే పెళ్లికొడుకు మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన రాంపురం, తిప్పనపల్లి శివారు ప్రాంతాల మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు జ్యోతి శ్రీను(30) పెళ్లి బుధవారం జరగాల్సి ఉండగా సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడి మృతితో పెళ్లి ఇంట్లో విషాదం అలముకుంది. పచ్చని తోరణాలతో కళకళలాడిన ఆ యువకుడి ఇంట్లో పెనువిషాదం నెలకొంది. బంధువుల రాకతో సందడిగా ఉన్న ఆ ఇల్లు ఒక్కసారిగా బోసిపోయింది. రోడ్డు ప్రమాదంలో శ్రీను మృతి చెందిన విషయం తెలియడంతో కుటుంబ సభ్యులంతా ప్రమాదస్థలికి చేరుకున్నారు. పసుపు బట్టలతో పెళ్లిపీఠలపై కూర్చోవాల్సిన వ్యక్తి రక్తపు మడుగులో రోడ్డుపై విగతజీవిగా పడి ఉండటం చూసి బోరున విలపించారు. ఈ ఘటన రెండు కుటుంబాలలో శోకాన్ని మిగిల్చింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న శీను త్వరలో ఉద్యోగం వస్తుందనే ధీమాతో ఈనెల 23న టేకులపల్లి మండలానికి చెందిన ఓ యువతితో పెళ్లికి సిద్ధమయ్యారు. బంధుమిత్రులందరికీ శుభలేఖలు పంచారు. ఘనంగా వేడుక నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లికూతురు ఇంట్లో శుభకార్యానికి హాజరై అందరితో కలిసి విందు భోజనం చేసి ద్విచక్రవాహనంపై తిప్పనపల్లికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ఆగి ఓ బ్యాగ్‌ను కొనుగోలు చేశాడు. ఆ బ్యాగ్‌ను వాహనం ముందు పెట్టుకుని వెళుతుండగా ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తల భాగానికి తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బ్యాగ్ వాహనం ట్యాంక్‌పై పెట్టుకోవడం వల్లే మూలమలుపు వద్ద వాహనం హ్యాండిల్ సరిగా తిరగలేదని, దీంతో తానంతట తానే పడిపోవడం సంభవించి ప్రమాదం చోటుచేసుకొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. చంద్రుగొండ, కొత్తగూడెం పోలీసులు ఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఫైజర్ టీకా తీసుకున్న జో బైడెన్

ప్రత్యక్షప్రసారం చేసిన న్యూస్ ఛానళ్లు

వాషింగ్టన్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ కరోనా టీకా తీసుకున్నారు. డెలావర్‌లోని క్రిస్టియానా ఆసుపత్రిలో 78 ఏళ్ల బైడెన్ ఫైజర్ టీకా మొదటి డోసు తీసుకున్నారు. బైడెన్ వ్యాక్సినేషన్ ఈ ఘట్టాన్ని అమెరికా ఛానళ్లు ప్రత్యక్షప్రసారం చేశాయి. టీకా తీసుకున్న సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ.. టీకా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల్లో అపోహను తొలగించేందుకే టీకా వేసుకుంటున్నాను. టీకా వేసుకోవడానికి ప్రజలు సన్నద్ధంగా ఉండాలి. నేను టీకా రెండో డోసు తీసుకోవడానికి ఎదురుచూస్తున్నానని బైడెన్ తెలిపారు. టీకా తీసుకుంటున్న సందర్భంగా బైడెన్ సతీమణి జిల్ బైడెన్ ఆయన పక్కనే ఉన్నారు. ఆమె అంతకు ముందురోజే టీకాను తీసుకున్నారు. ఫైజర్ వ్యాక్సిన్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ(ఎఫ్‌డీఏ) అనుమతి లభించిన నేపథ్యంలో భారీ ఎత్తున టీకా కార్యక్రమం మొదలైంది. గత వారం నుంచే అమెరికాలో పెద్దఎత్తున కరోనా టీకాను ఫ్రంట్ లైన్ వర్కర్లు అయిన ఆరోగ్య సిబ్బందికి ఇస్తున్నారు. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో ప్రజలంతా మాస్క్‌లు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని జోబైడెన్ మరోసారి అమెరికన్లకు విజ్ఞప్తి చేశారు.

ప్రఖ్యాత బలూచీ కార్యకర్త అనుమానాస్ప మృతి

టోరంటోలో శవమై కనిపించిన కరీమా బలూచీ

టోరంటో,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): ప్రపంచ ప్రఖ్యాత కార్యకర్త కరీమా బలూచ్ అనుమానాస్పద స్థితిలో మరణించారు. పాకిస్థాన్ సైన్యం, బలూచిస్థాన్ ప్రభుత్వ దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రఖ్యాత కార్యకర్త కరీమా బలూచ్ మృతదేహాన్ని టొరంటోలో కనుగొన్నారు. కరీమా బలూచ్ కెనడియన్ శరణార్థి. 2016లో ప్రపంచంలోని 100 మంది ప్రభావవంతమైన మహిళల్లో ఒకరిగా నిలిచారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు చివరిసారిగా కనిపించిన కరీమా మృతదేహమై కనిపించిందని ఆమె కుటుంబసభ్యులు చెప్పారు. బలూచిస్థాన్‌లో ప్రసిద్ధ మహిళ అయిన కరీమా మహిళా క్రియాశీలతకు మార్గదర్శకురాలిగా నిలిచారు. స్విట్జర్లాండులో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో బలూచిస్థాన్ సమస్యను కరీమా లేవనెత్తారు. ఆమె పట్ల పాక్ ప్రభుత్వం వ్యతిరేకతతో ఉంది. ఈ సమయంలో ఆమె శవమై కానరావడంతో అనుమానాలు కలుగుతున్నాయి.

స్పుత్నిక్-వి కొత్త కొవిడ్ స్ట్రెన్‌ను ఎదుర్కోగలదు

రష్యా డైరెక్ట్ ఇన్వెస్టిమెంట్ ఫండ్ సీఈవో కిరిల్ డిమిట్రీవ్ ధీమా

మాస్కో,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): యూరప్ దేశాలను వణికిస్తున్న కొత్త రకం కరోనా వైరస్‌ను తాము అభివృద్ధి చేసిన స్పుత్నిక్-వి వ్యాక్సిన్ ఎదురొడ్డగలదని రష్యా డైరెక్ట్ ఇన్వెస్టిమెంట్ ఫండ్ (ఆర్‌డీఐఎఫ్) సీఈవో కిరిల్ డిమిట్రీవ్ ధీమా వ్యక్తం చేశారు. తమకున్న సమాచారం ప్రకారం యూరప్‌లో వెలుగు చూసిన కొత్త రకం కరోనా స్ట్రెన్‌పై స్పుత్నిక్-వి ప్రభావంతంగా పనిచేస్తుందని చెప్పారు. ఎస్-ప్రొటీన్ గత పరివర్తనలపైనా స్పుత్నిక్-వి ఎంతో ప్రభావవంతంగా పనిచేసిందన్నారు. కొవిడ్-19 కొత్త మ్యుటేషన్ స్ట్రెన్‌ను ఎదుర్కొనేందుకు ఆస్ట్రాజెనెకాతోపాటు మరో వ్యాక్సిన్ తయారీ కంపెనీతో కలిసి పనిచేస్తున్నట్టు డిమిట్రీవ్ పేర్కొన్నారు. కరోనా వైరస్ పరివర్తన చెందిన ప్రస్తుత సమయంలో అలాంటి ఫార్మాస్యూటికల్ కంపెనీలతో కలిసి పనిచేయడం ఎంతో అవసరమన్నారు. స్పుత్నిక్ టీకా వినియోగం కోసం బెలారస్‌లో రిజిస్టర్ చేసుకున్నట్టు చెప్పారు. స్పుత్నిక్-వి టీకా 95 శాతానికి పైగా ప్రభావంతంగా పనిచేస్తున్నట్టు గత వారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఈ టీకా 96-97 శాతం ప్రభావవంతంగా పనిచేస్తోందని ఆరోగ్య నిపుణులను ఉటంకిస్తూ రష్యా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా పేర్కొంది. ఆగస్టు 11న స్పుత్నిక్-వి టీకాను రష్యా రిజిస్టర్ చేసింది. ఫలితంగా కరోనా వ్యాక్సిన్‌ను రిజిస్టర్ చేసిన ప్రపంచంలోనే తొలి దేశంగా రష్యా రికార్డులకెక్కింది.

లండన్ వైరస్ వ్యాప్తిని బట్టి తదుపరి చర్యలు

-పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): బ్రిటన్‌లో కొత్త రకం కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఆ దేశానికి విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపేసిన భారత ప్రభుత్వం అవసరమైతే మరిన్ని చర్యలకు సైతం సిద్ధంగ ఆఉంది. ఈ కొత్త రకం వైరస్ ఇతర దేశాలకు పాకితే.. ఆయా దేశాలకు కూడా విమాన సర్వీసులను నిలిపేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు. జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్ లాంటి యురోపియన్ దేశాలు యూకేకి ప్రయాణాన్ని నిలిపేశాయి. ఒకవేళ ఈ కొత్త రకం వైరస్ ఇతర దేశాలకు పాకినట్లు మాకు సమాచారం వస్తే.. ఆ దేశాలకూ విమానాలు నిలిపేసే అంశాన్ని పరిశీలిస్తాం అని ఆయన వెల్లడించారు. మంగళవారం రాత్రి 11.59 గంటల వరకు యూకే నుంచి ఇండియాకు విమానాలు వచ్చేందుకు అనుమతి ఇచ్చారు. అయితే వీటిలో వచ్చే ప్రయాణికులు తప్పనిసరిగా ఆర్టీ-పీసీఆర్ టెస్ట్ చేయించుకోవాలన్న నిబంధన విధించారు. పాజిటివ్‌గా తేలిన వాళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలకు తరలిస్తామని, నెగటివ్ వచ్చిన వాళ్లు ఏడు రోజుల పాటు హోం ఐసోలేషన్‌లో ఉండాలని మంత్రి చెప్పారు.

దుబ్బాకలో ఎందుకు ఆస్పత్రి పూర్తి కాదు: రఘునందన్ రావు

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): గజ్వేల్‌లో 100 పడకల ఆస్పత్రి పూర్తయి రెండుళ్లు అవుతుంటే దుబ్బాకలో ఎందుకు పూర్తి కావడం లేదని ప్రభుత్వాన్ని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి తనను పిలవలేదన్నారు. మెడికల్ కాలేజీలో సీట్లు సిద్ధిపేట నియోజకవర్గం వారికే ఇస్తారా? అని జడ్పీ సమావేశంలో ఆయన ప్రశ్నించారు.

డిసెంబర్ కాంక్లేవ్‌పై కానరాని స్పందన

మరింత సైలెంట్‌గా కెసిఆర్ రాజకీయ కార్యకలాపాలు

క్షేత్రస్థాయిలో విమర్శలకు పదును పెట్టిన టిఆర్ఎస్ నేతలు

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): బిజెపికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలతో డిసెంబర్‌లో పెద్ద సదస్సును నిర్వహిస్తానని సిఎం కెసిఆర్ ప్రకటించినా..దానిపై ఎలాంటి కదలికా కానరావడం లేదు. జిహెచ్ఎంసి ఎన్నికలకు ముందు కెసిఆర్ బిజెపి వ్యతిరేక ఫ్రంట్ గురించి ప్రకటించారు. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికపై ప్రకటన చేశారు. అయితే డిసెంబర్ నెలాఖరు కావస్తున్నా ఇంతవరకు అలాంటి దానిపై ఎక్కడా ప్రయత్నాలు కానరావడం లేదు. మరోవైపు టిఆర్ఎస్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు మాత్రం జిల్లాల్లో బిజెపి వ్యతిరేక విమర్శల స్వరం పెంచారు. ఎక్కడికక్డ బిజెపిని విమర్శించే పనుల్లో వేగం పెంచారు. బిజెపి రాష్ట్రానికి ఏం చేసిందని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్న విమర్శలను పెంచారు. అయితే కెసిఆర్ మాత్రం ఢిల్లీ వెళ్లి వచ్చాక సైలెంట్ అయ్యారు. ఎక్కడా దూకుడు ప్రదర్శించడం లేదు. నిజానికి ప్రజల్లో తన పట్టును తిరిగి సాధించ దానికి కావలసినంత వ్యవధి కేసీఆర్‌కు ఉంది. అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు. అలాగే ప్రజల్లో వస్తున్న వ్యతిరేక విధానాలపై చర్యలు తీసుకోవడం లేదు. హైదరాబాద్ వరద సాయం అందచేత, ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్లు, దరణి తదితర సమస్యలను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. మజ్లిస్ పార్టీతో అవసరానికి మించి స్నేహం చేయడం వల్లనే ప్రతికూల ఫలితాలు వస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దీంతో బీజేపీకి అదే ఆయుధంగా మారింది. బండి సంజయ్ ఇప్పుడు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ లక్ష్యంగా విమర్శలకు పదును పెట్టారు. అలాగే తెలంగాణలో ఆయన పనైపోం ముందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఘాటుగా విమర్శిస్తున్నారు. కెసిఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ ఉద్యమనేత అని, ఎవరినీ లెక్కచేయని ధైర్యశాలి అని తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడని మంత్రులు అంటున్నారు. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో కొంత వ్యతిరేకత వచ్చినంత మాత్రాన బిజెపి అతిగా ఊహించుకుంటుందని విమర్శిస్తున్నారు. కేంద్రంపై ఇక యుద్ధమే అని ప్రకటించిన వెంటనే కేసీఆర్ ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాలను కలుసుకోవడం తరవాత. .సైలెంట్ కావడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేసింది. మిషన్ భగీరథ, కాకతీయ పథకాలకు ఆర్థిక సహాయం చేయాలని, కాళేశ్వరం మూడవ దశకు అనుమతివ్వాలని కేంద్ర పెద్దలను కేసీఆర్ కోరినట్టు లీకులిచ్చారు. ఢిల్లీలో పెద్దల ముందు పొర్లు దండాలు పెట్టినా కేసీఆర్ జైలుకు వెళ్లకుండా తప్పించుకోలేరని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆ వెంటనే ప్రకటనలు గమనార్హం. హైదరాబాద్‌లో బిజెపి వ్యతిరేక కాంక్లేవ్ నిర్మిస్తానన్న మాట మేరకు ప్రయత్నాలు జరిగివుంటే కెసిఆర్ ఇమేజ్ పెరిగేది. వివిధ సమస్యలకు పరిష్కార చర్యలు తీసుకుంట లానే కెసిఆర్ ప్రకటించిన మేరకు బిజెపి వ్యతిరేక సదస్సు జరగాలని టిఆర్ఎస్ నేతలు కూడా కోరుకుంటున్నారు. సదస్సు నిర్వహించకుంటే జాతీయస్థాయి నాయకుల వద్ద గతంలోనే విశ్వసనీయతను కోల్పోయిన కేసీఆర్.. ఇప్పుడు తెలంగాణ ప్రజల్లో కూడా పరపతి కోల్పోతారన్న భావన ఉంది. తెలంగాణలో ఆయనకు ఇప్పటివరకు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కేసీఆర్ అంటే ఎవరినీ లెక్కచేయని ధైర్యశాలి అని తెలంగాణ ప్రజలు నమ్ముతూ వచ్చారు. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో పరాభవం తర్వాత ఆయన చేష్టలతో ప్రజల్లో ఆయనకున్న ఇమేజ్ తగ్గింది. అయితే ఇది తాత్కాలికమే అని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టడం, ఉద్యమ నేతలను దగ్గరికి తీయడం, కుటుంబ పెత్తనం తగ్గిస్తే మళ్లీ కెసిఆర్ ముసువటి అవకాశాలను పొందుతారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. బీజేపీతో యుద్ధం చేస్తానని చెప్పిన వెంటనే తమ నాయకుడు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలుసుకోవడంతో ..ఇప్పుడు సైలెంట్‌గా ఎందుకు ఉన్నారని టీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు తెలంగాణలో ఊపు మీదున్న బీజేపీతో చేతులు కలపడానికి టీఆర్ఎస్ ముఖ్యులు కొందరు పావులు కదుపుతున్నారని బిజెపి నేతలు చెబుతున్నారు. ధరణి చట్టం వల్ల చిక్కులు రావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్ఆర్ఎస్ స్కీమ్ కూడా కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడటానికి కారణమైంది. ప్రజల్లో అసంతృప్తి ఏర్పడటానికి కారణాలు అన్వేషించకుండా.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రజలు పెద్దగా ఆదరించడం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా హామీలు ఇచ్చుకుంటూ పోవడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతోంది. నిజానికి ప్రజల్లో తన పట్టును తిరిగి పొందడానికి తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలపై పనిచేయాలని కోరుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక వ్యాఖ్యలు

కరోనా కట్టడికి అనుసరిస్తున్న విధానాలనే పాటించాలి

అజాగ్రత్త వహిస్తే ప్రమాదం తప్పకపోవచ్చని హెచ్చరిక

ఇప్పటికే పలుదేశాలకు పాకి ఉంటుందన్న సౌమ్యాస్వామినాథన్

లండన్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): బ్రిటన్‌లో వెలుగులోకి వచ్చి యావత్తు ప్రపంచాన్ని వణికిస్తోన్న కొత్త రకం కరోనా వైరస్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటి వరకు ఈ నూతన రకం వ్యాప్తి అదుపు తప్పలేదని స్పష్టం చేసింది.

కరోనా కట్టడికి తొలి నుంచి అనుసరిస్తున్న విధానాలనే పాటిస్తే దీన్ని నియంత్రించ వచ్చని వివరించింది. గతంలో ఇంతకంటే భారీ స్థాయి విజృంభణను చూశామని.. దానితో పోలిస్తే దీని వ్యాప్తి అదుపు తప్పలేదని చెప్పవచ్చని అభిప్రాయపడింది. అయినప్పటికీ అప్రమత్తంగా ఉంటూ కరోనా నిబంధనల్ని పాటించాలని సూచించింది. అజాగ్రత్త వహిస్తే ప్రమాదం తప్పకపోవచ్చునని హెచ్చరించింది. ప్రస్తుతం మనం అమలు చేస్తున్న నిబంధనలనే మరింత జాగ్రత్తగా పాటించాలి. అలాగే దీర్ఘ కాలం అనుసరించాలి. అలా అయితే కొత్త రకం కరోనా వ్యాప్తిని అదుపులో పెట్టవచ్చు. కొన్ని విషయాల్లో మరింత కఠినంగా ఉండాల్సిన అవసరమూ ఉందని డబ్ల్యూహెచ్‌వో అత్యవసర కార్యక్రమాల విభాగాధిపతి మైఖేల్ ర్యాన్ అభిప్రాయపడ్డారు. రూపుమార్చుకున్న కరోనా వైరస్ ఇప్పటి వరకు కాస్త రూపు మార్చుకున్న ఈ నూతన వైరస్ ప్రస్తుతానికి బ్రిటన్‌తోపాటు మరో 4-5 దేశాల్లో వెలుగుచూసింది. అయితే కొత్త రకం కరోనా వైరస్ ఇంతకుముందు వైరస్‌తో పోలిస్తే 70 శాతం ఎక్కువ వేగంగా వ్యాప్తి చెందుతోందన్న వార్త ప్రపంచ దేశాల్ని గడగడలాడిస్తోంది. ముఖ్యంగా బ్రిటన్ పేరెత్తితేనే అంతర్జాతీయ సమాజం వణికిపోతోంది. ఇకపోతే కరోనా కొత్త స్ట్రెయిన్ పై ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్టు డాక్టర్ సౌమ్య స్వామినాథన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూకేలో వెలుగుచూసిన కరోనా కొత్త స్ట్రెయిన్ పలు దేశాల్లో ఉండవచ్చని డబ్ల్యూహెచ్‌ఓ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్ వెల్లడించారు. యూకేలో కరోనా కొత్త స్ట్రెయిన్ వేల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మరిన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. కరోనా కొత్త స్ట్రెయిన్ 70 శాతం మేర వేగంగా విస్తరిస్తున్నందు వల్ల ఇప్పటికే ఈ కొత్త వైరస్ పలు దేశాల్లో ఉండవచ్చని చెప్పారు. కరోనా కొత్త స్ట్రెయిన్ కేసులు ఆస్ట్రేలియా, డెన్మార్కు, నెదర్లాండు, ఇటలీ దేశాల్లో నమోదయ్యాయని డాక్టర్ సౌమ్య చెప్పారు. దక్షిణాఫ్రికా దేశంలో కరోనా కొత్త స్ట్రెయిన్ వేగంగా విస్తరిస్తోందని ఆమె పేర్కొన్నారు. యూకేలో కరోనా కొత్త స్ట్రెయిన్ గురించి అర్థం చేసుకునేందుకు ప్రయోగాలు సాగుతున్నా యని, దీని ఫలితాలు మరికొన్ని వారాల్లో వస్తాయని చెప్పారు. సమర్థవంతమైన వ్యాక్సిన్ ను అభివృద్ధి చేయగల సామర్థ్యం భారతదేశానికి ఉందని డాక్టర్ సౌమ్య తెలిపారు. కరోనా కొత్త స్ట్రెయిన్ వైరస్ ను నియంత్రించడానికి దీని వ్యాప్తిని తగ్గించడానికి అన్ని దేశాలు చర్యలు తీసుకోవాలని, పరీక్షలు చేయడం, కొత్త స్ట్రెయిన్ పాజిటివ్ కేసులను వేరు చేయడం ద్వారా దీన్ని కట్టడి చేయవచ్చని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ సైంటిస్టు వివరించారు.

పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న సర్కార్

సర్పంచ్‌లను వేదిస్తూ బెదరిస్తున్నారు.

నిధులు ఇవ్వడంలో నిర్లక్ష్యంతో నిస్తేజంగా గ్రామాలు

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): కెసిఆర్ పాలనలో గ్రామ పంచాయితీలు నిర్వీర్యం అయ్యాయని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. పంచాయితీలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేరుగా నిధులు ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వం ట్రాక్టర్ల కొనుగోళ్లు, స్మశానవాటికల నిర్మాణాలు, హరితహారాలు పనులు చేయించి పంచాయతీ నిధులు ఖర్చు చేయిస్తోందన్నారు. కాంగ్రెస్ సర్పంచులు ఉన్న దగ్గర కనీసం ప్రోటోకాల్ పాటించకుండా టీఆర్ఎస్ నేతలు వేధిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ చెక్ పవర్ రద్దు చేస్తామని బెదిరిస్తోందన్నారు. పంచాయతీలకు హక్కుగా రావాల్సిన నిధులను కూడా రానీయడం లేదని, పంచాయతీలను ఉత్సవ విగ్రహాలుగా చేసిందన్నారు. టీఆర్ఎస్‌కు కాలం దగ్గర పడిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఇక కల్వకుంట్ల కంపెనీ ఇంటికి పోవాల్సిందేనని తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను టీఆర్ఎస్ వేధిస్తోందని ఉత్తమ్ దుయ్యబట్టారు. ఇలాంటి దరిద్రపు పాలన ఎన్నడూ చూడలేదని తప్పుబట్టారు. శాతియుతంగా దీక్ష చేస్తుంటే అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన ఫైనాన్స్ కమిషన్ నిధులను వాడుకున్నారని, సర్పంచ్, ఉప సర్పంచులకు చెక్ పవర్ విడ్డూరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇకపోతే టీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజాస్వామ్య పునాదులు బలోపేతం చేసేందుకు పోరాటం చేద్దామని భట్టి విక్రమార్క పిలుపు ఇచ్చారు. ఆత్మగౌరవం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు దీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని మరో కాంగ్రెస్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులే అసలైన ప్రజా నేతలని కొనియాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు కాంట్రాక్ట్ బిల్లులు ఇవ్వడం లేదని, పార్టీ మారితే బిల్లులు ఇస్తామని టీఆర్ఎస్ నేతలు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రోజురోజుకు దిగజారిపోతోందని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ఆత్మగౌవరాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని ఆయన హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని పొన్నాల లక్ష్మయ్య ప్రకటించారు.

తమిళనాట నూతన సంవత్సర వేడుకలపై నిషేధం

ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం

చెన్నై,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): నూతన సంవత్సర వేడుకలపై నిషేధం విధిస్తున్నట్టు తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సచివాలయం ప్రకటన విడుదల చేసింది. కొత్త కరోనా స్ట్రెయిన్ వ్యాప్తి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది కరోనా వైరస్ కారణంగా అన్ని రకాల వేడుకలను నిషేధించిన ప్రభుత్వం, అనంతరం లాక్‌డౌన్ నిబంధనలకు సడలింపులు ఇచ్చి తక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొని వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతించింది. ఈ నేపథ్యంలో, విదేశాల్లో కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుండడాన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నూతన సంవత్సర వేడుకలపై నిషేధం విధిస్తున్నట్టు సీఎం వెల్లడించారు. ఈ రోజున బీచ్‌లు, రోడ్లు, క్లబ్‌లు, రిసార్ట్‌లు, హోటళ్లు తదితరాల్లో ఎలాంటి వేడుకలు నిర్వహించరాదని, ఈనెల 31, జనవరి 1 తేదీల్లో బీచ్‌లోకి సందర్శకులను అనుమతించమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ప్రజలు సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ యువతీయువకులు వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా డిసెంబరు 31వ తేది రాత్రి 10 గంటల నుంచే వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మెరీనా తీరంలో యువత పెద్ద సంఖ్యలో గుమిగూడి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతుంటారు. వేడుకల అనంతరం వారు బైక్‌లపై రోడ్లలో తిరుగుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

పంటల కొనుగోళ్ల విధానంలో మార్పులు రావాలి

-కేంద్రం విధిస్తున్న పరిమితులపై మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): రైతులు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధరకు పంటల కొనుగోళ్లలో కేంద్రం విధిస్తున్న పరిమితి విధానంలోమార్పు రావాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానం మూలంగా సాగు, దిగుబడులు పెరుగుతున్నాయి. దానిని కేంద్రం పరిగణలోకి తీసుకోక పోవడం విచారకరమని అన్నారు. సోమవారం మంత్రుల నివాసంలో యాసంగి పంటలు, కొనుగోళ్లు, ఎరువుల వినియోగం, భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటలు, ఉత్తమసాగుపద్ధతులు తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరకు కందిపంట కొనుగోలు పరిమితి పెంచాలని కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించినట్టు చెప్పారు. కేంద్రం ఐదేళ్ల సగటు సాగును పరిగణలోకి తీసుకుని దిగుబడిలో 25శాతం పంటకే మద్దతు ధర వర్తించేలా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. కేంద్రం ఈ ఏడాది తెలంగాణలో సాగయిన కంది పంట దిగుబడి పరిగణలోకి తీసుకుని ఎంఎస్‌పి పై కొనుగోలు చేయాలన్నారు. తెలంగాణలో రైతులు తాము పండించిన పంటలు మంచి ధరకే అమ్ముకునే రోజులు రావాలన్నారు. అప్పుడే రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. కందుల కొనుగోలుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని మంత్రి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశ

నిఖార్సయిన రాజకీయవేత్త .నిజాయితీ పరుడైన రైతు

జీవితాంతం రైతు సంక్షేమానికి పాటుపడ్డ నేత
నేడు దివంగత ప్రధాని చరణ్‌సింగ్ జయంతి
కిసాన్ దివస్‌గా చరణ్ సింగ్ జయంతి



న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): నిఖార్సయిన రాజకీయవేత్త మాత్రమే కాదు..నిజాయితీ పరుడైన రైతుగా జీవితాంతం నిలిచిన అరుదైన వ్యక్తి దివగంత చౌధురీ చరణ్ సింగ్. ఆయన ప్రధానిగా ఉన్నది కొద్ది కాలమే అయినా...తన జీవితంలో రాజీలేని నేతగా నిలిచారు. ఇందిరాగాంధీ రాజకీయాలకు బలైపోయిన వ్యక్తిగా చరిత్రను తరచిచూస్తే తెలుస్తుంది. భారతదేశంలో సహకార సేద్యం విజయవంతం కాదని తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టిన రైతు నాయకుడాయన. ఒక రైతు కుమారునిగా, ఒక రైతుకు సరైన యాజ మాన్య హక్కు అతను వ్యవసాయ దారునిగా ఉండడమేనని అభిప్రాయపడ్డాడు. అతను రైతు యాజమాన్య వ్యవస్థను సంరక్షించి స్థిరీకరించాలని కోరుకున్నాడు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా చరణ్‌సింగ్ భూసంస్కరణలు చేపట్టాడు. 1960 లాండ్ హోల్డింగ్ చట్టాన్ని తీసుకుని వచ్చాడు. చరణ్‌సింగ్ 1902లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మీరట్ జిల్లాలోని నూర్‌పూర్ గ్రామంలోని జాట్ రైతు కుటుంబంలో జన్మించాడు. మహాత్మా గాంధీ అద్వర్యంలో జరిగిన భారత స్వాతంత్యోద్రమంలో చేరాడు. గజియాబాద్ జిల్లాలోని ఆర్యసమాజ్, అదే విధంగా మీరట్ జిల్లాలోని భారత జాతీయ కాంగ్రెస్‌లలో 1931 నుండి క్రియాశీలకంగా ఉన్నాడు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రెండు సార్లు జైలు పాలయ్యాడు. భారత స్వాతంత్యానికి ముందు అతను 1937లో యునైటెడ్ ప్రొవిన్సెస్ శాసనసభలో సభ్యునిగా ఉన్నాడు. స్వయంగా రైతు కావడం కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించే చట్టాలపై ఎక్కువ ఆసక్తిని కనబర్చేవాడు. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తన సైద్ధాంతిక, ఆచరణాత్మక విధానాన్ని నిర్మించాడు. 1962 – 1967 మధ్య కాలంలో అతను రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలలోని ముగ్గురు ప్రధాన నాయకులలో ఒకనిగా ఉన్నాడు. ఈ కాలం తరువాత, చరణ్ సింగ్ 1967 ఏప్రిల్ 1 న కాంగ్రెస్ నుండి వైదొలగి, ప్రతిపక్ష పార్టీలోనికి చేరాడు. అపుడు ఉత్తరప్రదేశ్‌లో మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి అయ్యాడు. 1967–1971 మధ్యకాలంలో భారతదేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు బలమైన శక్తిగా ఉండే కాలం. జనతా కూటమిలో ప్రధాన భాగమైన భారతీయ లోక్‌దళ్ పార్టీ నాయకునిగా, అతను 1977 లో జయప్రకాష్ నారాయణ్ ప్రధానమంత్రిగా మొరార్జీ దేశాయ్‌ను ఎంపిక చేసాడు. ప్రధానమంత్రి పదవి తన కోసం కాదనీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆసక్తితో తన విప్లవాత్మక ఆర్థిక కార్యక్రమాలను అమలు చేయటానికి వీలు కల్పించటానికి ఉపయోగపడుతుందనీ ఆశించి ప్రధాని రేసులో నిలబడ్డాడు. కానీ తన ఆశయం నెరవేరనందున నిరాశ చెందాడు. 1977 లోక్‌సభ ఎన్నికల్లో, జనతా పార్టీతో కలసి ఎన్నికలలో పాల్గొనడానికి కొద్ది నెలల ముందు వరకు, అతను 1974 నుండి ఒంటరిగానే పోరాడుతూ ఉన్నాడు. రాజ్ నారాయణ చేసిన కృషి కారణంగా ఆయన 1979 లో ప్రధాని అయ్యాడు. రాజ్ నారాయణ్ జనతా పార్టీ (సెక్యులర్) ఛైర్మన్‌గా, చరణ్ సింగ్‌ను ప్రధానమంత్రిగా నియమించాడు. ఉత్తరప్రదేశ్‌లో 1967 లో ఆయన ముఖ్యమంత్రిగా ఉండడానికి కూడా అతను సహాయం చేసాడు. అయితే, 'ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీ' ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నప్పుడు కేవలం 24 వారాల తరువాత ఆయన పదవికి రాజీనామా చేశాడు. 1979 జూలై 28 నుండి 1980 జనవరి 14 వరకు చరణ్ సింగ్ భారతదేశ 5వ ప్రధానమంత్రిగా పనిచేశాడు. ప్రధానమంత్రి కంటే ముందు ఈయన ఉప ప్రధానమంత్రిగా కూడా పనిచేశాడు. చరణ్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో లోక్‌సభ ఎన్నడూ సమావేశం కాలేదు. లోక్‌సభ సమావేశం ప్రారంభవుతుందనగా, ముందురోజు ఈయన ప్రభుత్వానికి మద్దతునిచ్చిన కాంగ్రెసు పార్టీ మద్దతు ఉపసంహరించుకోవడంతో భారతీయ లోక్‌దళ్ ప్రభుత్వం కూలిపోయింది. చరణ్ సింగ్ పదవికి రాజీనామా చేశాడు. 6 నెలల అనంతరం లోక్‌సభకు మళ్ళీ ఎన్నికలు జరిగాయి. చరణ్ సింగ్ 1987 లో తన మరణం వరకు లోక్‌దళ్ పార్టీకి నాయకత్వం వహిస్తూ ప్రతిపక్షంలో ఉన్నాడు. చరణ్ సింగ్ సోవియట్–శైలి ఆర్థిక సంస్కరణల పై జవహర్ లాల్ నెహ్రూను వ్యతిరేకించాడు. అతను 1947 తరువాత ఉత్తర భారతదేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మార్చడానికి సహాయం చేసాడు. నెహ్రూ ఆర్థిక విధానం గురించి బహిరంగ విమర్శలు చేసిన కారణంగా చరణ్ సింగ్ రాజకీయ జీవితానికి అడ్డంకిగా మారింది. 1946లో గోవింద వల్లభ్ పంత్ మంత్రివర్గములో పార్లమెంటరీ కార్యదర్శియై రెవిన్యూ, ఆరోగ్య, సాంఘిక పరిశుభ్రత, న్యాయ, సమాచార శాఖలలో పనిచేశాడు. 1951 జూన్ లో రాష్ట్రంలో కేబినెట్ మంత్రిగా నియమితుడై న్యాయ, సమాచార శాఖ మంత్రిగా ఆ తరువాత 1952లో డా.సంపూర్ణానంద్ మంత్రివర్గంలో రెవిన్యూ, వ్యవసాయ శాఖా మంత్రిగా పనిచేశాడు. 1959 ఏప్రిల్ లో మంత్రి పదవికి రాజీనామా చేశాడు. చరణ్‌సింగ్ 1960లో హోమ్, వ్యవసాయశాఖా మంత్రిగా, 1962–63లో వ్యవసాయ , అటవీ శాఖా మంత్రిగా పనిచేశాడు. 1965లో వ్యవసాయ శాఖను విడిచి 1966లో స్థానిక స్వయంపరిపాలనా శాఖకు మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 1967లో చరణ్ సింగ్ కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టి భారతీయ క్రాంతి దళ్ పార్టీని స్థాపించాడు.

1967లో రాజ్‌నారాయణ్, రామ్ మనోహర్ లోహియాల మద్దతుతో అతను ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు. కాంగ్రెసు పార్టీ చీలిక తర్వాత, 1970 ఫిబ్రవరిలో కాంగ్రెసు మద్దతుతో ఉత్తర ప్రదేశ్‌కు రెండవసారి ముఖ్యమంత్రయ్యాడు. కానీ 1970 అక్టోబరు 2 న కేంద్రం ఈయన ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించింది. 1975 లో ఇందిరాగాంధీచే జైలుకు పంపబడ్డాడు. ఆమె అత్యవసర పరిస్థితి విధించి రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపించింది. 1977 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. ప్రత్యర్థి పార్టీకి చౌదరి చరణ్ సింగ్ సీనియర్ నాయకునిగా పదవిలోకి వచ్చాడు. అతను మొరార్జీ దేశాయి ప్రధానమంత్రిగా ఉన్న జనతా పార్టీ ప్రభుత్వంలో ఉప ప్రధానమంత్రిగా, హోం మంత్రిగా పనిచేసాడు.

గెలిచిన అభ్యర్థుల జాబితాతో గెజిట్ విడుదల చేయాలి

ఎన్నికల కమిషన్ పార్థసారథిని కోరిన బిజెపి నేతలు

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల వివరాలతో గెజిట్ విడుదల చేయాలని ఎన్నికల కమిషనర్‌ను బీజేపీ నేతలు కోరారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి కలిసిన బీజేపీ నేతలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రేటర్ ఎన్నికల్లో కార్పొరేటర్లు గెలిచిన తర్వాత గెజిట్ విడుదల చేయకపోవడానికి కారణాలు తెలపాలన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వెంటనే గెజిట్ విడుదల చేయాలని చట్టం చెబుతుందని..ఎందుకు గెజిట్ విడుదల చేయడం లేదని అన్నారు. ప్రస్తుత పాలకమండలి ఫిబ్రవరి 10 వరకు ఉన్నప్పుడూ ముందుగానే ఎందుకు ఎన్నికలు నిర్వహించారో తెలుపాలన్నారు. గెజిట్ విడుదల చేసిన తర్వాత గ్రేటర్ పాలక మండలి సమావేశం ఏర్పాటు చేయాలని..ఆ తర్వాత మేయర్ ఎన్నిక జరగాలన్నారు. ఎందుకు ఎన్నికల సంఘం ఆలస్యం చేస్తుందో కారణాలు చెప్పాలని బీజేపీ లీగల్ సెల్ నేతలు అన్నారు. పాలక మండలి ఏర్పాటుకు ఇంకా సమయం ఉందనడం అర్థరహితమన్నారు. సమయం ఉన్నప్పుడు ముందుగా ఎన్నికలు ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఎస్ఈసీ అధికార పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతోందని ఆయన ఆరోపించారు. నోటిఫికేషన్ ఇవ్వకపోతే నిరసన చేపడతామని రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ విషయంలో గవర్నర్‌ను కూడా కలసి వివరిస్తామని ప్రభాకర్ తెలిపారు.

రిమ్స్ కోసం కేంద్రం 120కోట్లు విడుదల

రాష్ట్రవాటా 30కోట్లు విడుదల చేయని కెసిఆర్ సర్కార్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఆదిలాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): వందల, వేల కోట్లను దుబారా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం మాత్రం నిధులు విడుదల చేయడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... కమీషన్ల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్‌లో రిమ్స్‌కు అనుబంధంగా కేంద్రం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కోసం రూ.120కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అయితే నాలుగేళ్లు అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రూ.30కోట్ల రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పనులు సాగడం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పటికైనా స్పందించి... అవసరమైన నిధులు విడుదల చేయాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. వెనుకబడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కేంద్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రూ.120 కోట్లు మంజూరు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్లవుతున్నా తన వాటా 30 కోట్లు ఇవ్వడం లేదని మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రం వాటా 30 కోట్లలో ఒక్కరూపాయి కూడా ఇవ్వనందున ఆసుపత్రి ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. లక్ష కోట్లు అప్పు చేసిన కేసీఆర్ కు.. వందల వేల కోట్లు దుబారా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ల పేరు మీద దండుకుంటున్నా.. పేదల కోసం 30కోట్ల ఇవ్వడానికి కేసీఆర్ కి మనసు రావడం లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రి కోసం కేంద్రం కొనుగోకు చేసిన యంత్రాలు కూడా పాడు అయ్యే స్థితికి చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు గిఫ్ట్ గా ప్రధాని మోడీ ఈ ఆసుపత్రిని ఇచ్చారు.. కానీ సర్కార్ నిర్లక్ష్యం వల్ల పూర్తి కావడం లేదు.. ఆస్పత్రి స్టాఫ్ రిక్రూట్మెంట్ కి చెందిన ప్రాసెస్ రాష్ట్రం చేయాలి, ఇప్పటి వరకు చేయనూలేదు.. ప్రపంచ స్థాయి వైద్యం కోసం యంత్ర పరికరాలున్నాయి.. అయితే అందుకు తగ్గ నిపుణులు కూడా కావాల్సి ఉందని చెప్పారు. లక్షల కోట్ల అప్పులు చేసిన సర్కార్.. ఆదిలాబాద్ ఆసుపత్రికి 30కోట్లు ఇవ్వడం లేదని కిషన్ రెడ్డి విమర్శించారు.

అన్నదాత ఆక్రందనలు ఆగేదెపుడూ...!

(23 డిసెంబర్ 'జాతీయ రైతు దినోత్సవం' సందర్భంగా)

లోకానికి అన్నం అందించే ఏకైక వ్యక్తి కర్షకుడే. రైతే రాజు అన్నారు ఆనాడు. దేశానికి వెన్నెముక అని కూడా పొగిడారు. అయినా నేటి అన్నదాత అనాథగా సమాజ కూడలిలో జీవచ్ఛవంలా నిబడ్డాడా? రైతంటే ఆత్మహత్యలా? అప్పుల కుప్పల యజమానులా? పురుగు మందును ఆశ్రయించే నిర్భాగ్యులా? అతివృష్టి, అనావృష్టి అతని నిత్య శత్రువులా? రైతు పక్షాన నిలబడే దెవరు ? అన్నం పెట్టే వాడికి సున్నం పెట్టే రోజులివి. ఎవరూ పట్టించు కోకపోయినా కర్షకుడిగా తన శ్రమను పెట్టుబడిగా చేసుకొని, సమస్యలతో సంసారం చేస్తూ, తన చెమటనే పంట పైరుకు నీరుగా అందించి, తన ఆకలిని మరిచి, అందరి ఆకలిని తీర్చే దైవస్వరూపమే మన మట్టి మనిషి కర్షకుడు. ప్రపంచ మానవాళికి అన్నం రుచి చూపిన రైతు ఓ గ్రామదేవత. దేశాభివృద్ధిని నిర్ణయించే అమాయక నిరక్షరాస్యుడు. అత్యంత పురాతన వృత్తిగా గత 10,000 సంవత్సరాల నుంచే వ్యవసాయం గుర్తించబడింది. గ్రామీణ ప్రజలు 80 శాతం వ్యవసాయరంగంలోనే ఉంటూ, దేశ జిడిపికి 15 శాతం సహకరిస్తున్నారు. ఇంత జరిగినా విత్తనాల కొరత, వర్షాభావం, ఎరువుల కొరత, పురుగు మందుల కొనుగోలు, కరువుకాటకాలు, అతివృష్టితో పంట వరదల పాలుకావడం, కనీస ధరకు ఎదురుచూపులు, మధ్యవర్తుల అక్రమాలు, మార్కెటింగ్ సౌకర్యాల లేమి, పెట్టుబడి దాటని ఆదాయం, అప్పుల భారం పెరగడం, ఆశలు అడుగంటిన సంసారం లాంటి అనేక సమస్యల విషవలయంలో చిక్కిన బక్కజీవిగా మన రైతు దిగాలుగా మిగిలి పోవడం అత్యంత విచారకరం. రైతుల సమస్యలను సాధారణ ప్రజలకు, ముఖ్యంగా యువతకు మరియు పట్టణ జనాలకు అవగాహన కలుగచేస్తూ, కర్షకుల పక్షపాతిగా నిలవటానికి లభించిన అవకాశంగా చర్చించే వేదికగా మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జన్మదినం రోజున ప్రతియేటా 23 డిసెంబర్‌న దేశవ్యాప్తంగా 'జాతీయ రైతుల దినం లేదా కిసాన్ దివస్' పాటించుట జరుగుతోంది. వ్యవసాయ ఉత్పత్తులలో ప్రపంచ దేశాల్లో భారత్ 3వ స్థానంలో నిలుస్తున్నది. అధిక వ్యవసాయ ఉత్పత్తులు రికార్డు చేసే దేశాల్లో యూయస్, చైనా, బ్రెజిల్, ఇండియా మరియు రష్యాలు ముందున్నాయి. దేశంలోని వ్యవసాయ రాష్ట్రాలుగా పేరొందిన పంజాబ్, హరియానా, యంపి, యూపి, ఆంధ్ర, తెలంగాణలకు మంచి పేరుంది.

ఈ ఏడాది కిసాన్ దివస్ వేడుకలు కళ తప్పిన మాట వాస్తవం. ఇటీవల కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలు రైతు వ్యతిరేకంగా ఉన్నాయని, కార్పొరేట్‌కు అనుకూలమని, కనీస మద్దత్తు ధర దొరికదనే భయంతో నిరసన తెలుపుతూ గత 3 వారాలుగా దేశ రాజధానిలో రైతాంగ ఉద్యమం ఉధృతమవుతున్నది. కొత్తగా తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని గట్టి పట్టుదలతో రైతాంగం భీష్మించుకొని కూర్చుంది. కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి రైతుల అనుమానాలను నివృత్తి చేస్తూ చట్టాలకు సవరణలు చేస్తామని, చట్టాలను ఆసాంతం రద్దు చేయడం అంగీకారం కాదని రైతులను కోరుతున్నది. ఈ జాతీయ ఉద్యమం పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల రైతుల నాయకత్వంలో నడుస్తున్నది. రైతుల ఉద్యమానికి అందరూ ఊహించినట్లే ప్రతిపక్ష పార్టీలు అండగా ఉండడం జరుగుతున్నది. అదే క్రమంలో అసాంఘీకశక్తులు దేశాన్ని అస్థిర పరిచేందుకు ఉద్యమాన్ని ఆసరాగా తీసుకొనే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరిస్తున్నది. సాగు చట్టాలను రద్దు చేయాలని రైతులు మరియు చట్టాలకు సవరణలు చేస్తామని ప్రభుత్వం గట్టి గీతలు గీసుకున్న వేళ ఉద్యమం ఉగ్రరూపం దాల్చక ముందే ఉభయ పక్షాలు చర్చల్లో ఏకాభిప్రాయానికి రావాలని దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారు. రైతు ఉద్యమం రాజకీయాలకు దూరంగా ఉండాలని, కర్షకుని పక్షపాతిగా సఫలం కావాలని ఆశిద్దాం.

23 డిసెంబర్ 1902న హపూర్ జిల్లా, యూపీలో ఒక సాధారణ గ్రామీణ రైతు కుటుంబంలో చౌదరీ చరణ్‌సింగ్ జన్మించారు. మోహన్‌దాస్ గాంధీ ప్రేరణతో స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలు పాలైనారు. 1937లో లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికై, రైతుల పక్షపాతిగా పలు సమస్యలకు పరిష్కారాలు చూపారు. యూపీ రెవెన్యూశాఖ మంత్రిగా భూసంస్కరణల చట్టాలు చేపట్టారు. 18 సెప్టెంబర్ 1970 నుంచి 01 అక్టోబర్ 1970 వరకు యూపీ ముఖ్యమంత్రిగా పని చేశారు. 24 మార్చి 1977 నుంచి 01 జూలై 1978 వరకు కేంద్ర హోం మినిస్టర్‌గా, 24 జూలై 1979 నుంచి 28 జూలై 1979 వరకు ఆర్థికశాఖ మంత్రిగా మరియు 24 జనవరి 1979 నుంచి 28 జూలై 1979 వరకు దేశ 3వ ఉప ప్రధానమంత్రిగా సేవలందించారు. మన దేశ 5వ ప్రధానిగా (28 జూలై 1979 – 14 జనవరి 1980) పని చేసిన చౌదరీ చరణ్‌సింగ్, రైతులకు చేసిన సేవలకు గుర్తుగా అతని పుట్టిన రోజున కిసాన్ దివస్ నిర్వహించుట జరుగుతున్నది. ప్రధానమంత్రిగా అనేక రైతు ప్రయోజనకర చట్టాలు చేయడం జరిగింది. రైతు నాయకుడిగా ముద్ర పడిన చరణ్‌సింగ్ 29 మే 1987న తుదిశ్వాస విడిచి, 'కిసాన్ ఘాట్'లో శాశ్వత నిద్రలోకి పోయారు.

ప్రపంచదేశాల్లో రైతు ఇల్లు సుభిక్షంగా ఉంటే, ఆయా దేశాలు కూడా స్వయంసమృద్ధితో అన్నట్లుగానే భావించాలి. మానవ నాగరికతకు బీజాలు వేసింది వ్యవసాయమే. వ్యవసాయంతో అనేక అనుబంధరంగాలు కూడా పని చేస్తున్నాయి. ఊరికి ఊపిరి నాగలి. బతుకు బండి చక్రాలు కర్షకులు. వ్యవసాయం ఓ పవిత్ర వృత్తి. మట్టిని మాణిక్యంగా మార్చగలిగేది శ్రమజీవి రైతు మాత్రమే. వ్యవసాయం గతి తప్పితే, జాతి తిరోగమనం ఖాయం. మట్టి వాసనలు, మె?లక చిగురుల చిరునవ్వులు, పైరుకు పట్టిన తెగులు, పాల కంకి పరువాలు, పంట దిగుబడి మతలబులు తెలిసిన నిరక్షరాస్య వ్యవసాయ శాస్త్రజ్ఞుడు కర్షకుడు మాత్రమే అని మనందరికీ తెలుసు. రైతులకు సమస్త సౌకర్యాలను కల్పించి, వ్యవసాయం దండుగ కాదు, పండగ అనే రోజులు రావాలని కోరుకుందాం. కర్షకుడికి కోటి దండాలు పెడదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సంగారెడ్డి జిల్లా పల్వట్లలో తీవ్ర విషాదం

విషాహారం తిని ముగ్గురు మృతి
మరో ఇద్దరి పరిస్థితి విషమం

హైదరాబాద్,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పటాన్‌చెరు మండలం పల్వట్లలో విషాహారం తిని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని అయిదుగురు సోమవారం రాత్రి జొన్నరొ÷–టటెలు చేసుకొని తిన్నారు.

వీరందరికీ అర్ధరాత్రి వాంతులు, విరోచనాలు కావడంతో హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ఇద్దరు మృతిచెందారు. మిగతావారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మరోకరు మృతిచెందారు. మిగతా ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కాగా.. ఇదే కుటుంబానికి చెందిన ఓ వృద్ధురాలు 15 రోజుల కిందట మృతి చెందింది. చనిపోయిన ఆ వృద్ధురాలు కూడా రొట్టే తిన్న తర్వాతే వాంతులు, విరోచనాలు కావడంతో మృతిచెందింది. ఇప్పుడు చనిపోయిన వారు కూడా వృద్ధురాలు ఉపయోగించిన పిండితోనే రొ÷–టటెలు చేసుకొని తిన్నారు.

దాంతో పిండిలోనే విష పదార్థం కలిసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే.. ఇంట్లో ఉన్న పిండితో చేసిన రొట్టెలు తిని ముగ్గురు మృతి చెందారు.

రోజులాగే సోమవారం రాత్రి భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమిస్తుండగా చంద్రమౌళి(60), సుశీల(55), అనసూజ, శ్రీశైలం, సరిత ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరిని జోగిపేటకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చంద్రమౌళి, సుశీల, శ్రీశైలం మృతి చెందారు. మిగతా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఇటీవల ఇదే తరహాలో చంద్రమౌళి తల్లి పెద్ద శంకరమ్మ (70) మృతి చెందింది. ఎవరి దగ్గరో జొన్నపిండి తీసుకువచ్చిందని, ఆమె కూడా జొన్నరొట్టెలు తిన్న తర్వాతే అస్వస్థకు గురైందని స్థానికులు చెప్పారు. అదే మిగతా కుటుంబీకులెవరూ తినకపోవడంతో ప్రాణాల నుంచి బయటపడ్డారు. మళ్లీ సోమవారం రాత్రి అదే జొన్నపిండితో చేసిన రొట్టెలు తిన్న వెంటనే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఐదుగురు కుటుంబ సభ్యులు జొన్నపిండితో చేసిన రొట్టెలు తినడంతో ముగ్గురు మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. పక్షం రోజుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడడంతో గ్రామంలో విషాదం నెలకొంది.అయితే జొన్నపిండి ఎక్కడి నుంచి వచ్చింది..? ఎవరు ఇచ్చారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

జనవరి 3 నుండి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 22 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్టార్ క్రికెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రీమియర్ లీగ్– 2 క్రికెట్ టోర్నమెంట్ ను వచ్చే నెల 3 వ తేదీ నుండి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు స్టార్ క్రికెట్ క్లబ్ కెప్టెన్, ఎస్ పి ఎల్ డైరెక్టర్ కీసరి నాగరాజు తెలిపారు. స్టార్ క్రికెట్ క్లబ్ స్థాపించి సిల్వర్ జూబ్లీ పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు స్టార్ క్రికెట్ క్లబ్ గత 25 సంవత్సరాల నుండి అనేక విజయాలు సాధిస్తూ తమ జట్టు నుండి ఇద్దరూ క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి లో ఆడారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కు మంచి పేరు తెచ్చామని, రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తామని చెప్పారు కృషిచేస్తామని చెప్పారు ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని కీసరి నాగరాజు తెలిపారు.

కెసిఆర్ అవినీతిపై యుద్ధం చేస్తాం

కటుఉంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతాం
వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఉద్యోగ ప్రకటన
మీడియా సమావేశంలో బిజెపి సీనియర్ నేత మురళీధర్ రావు

న్యూఢిల్లీ,డిసెంబర్22(ఆర్ఎన్ఎ): కెసిఆర్ అవినీతిని బయటపెట్టి కుటుంబ పాలనకు చరమగీతం పాడుతామని, అందుకోసం బిజెపి పోరాడుతుందని భాజపా సీనియర్ నేత మురళీధర్‌రావు అన్నారు. కేవలం కుఉటంబం కోసం తప్ప ప్రజల కోస చేస్తున్నదేమీ లేదన్నారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో సాధారణ పరిపాలన ఆగిపోయింది, ఎన్నికలే రాష్ట్రాన్ని నడిపిస్తున్నాయా అనిపిస్తోందని మురళీధర్‌రావు అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దుబ్బాకలో భాజపా గెలుపు తర్వాత తెరాసకు మూర్ఛ వచ్చినంత పనైందని వ్యాఖ్యానించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం రూ.10వేల వరద సాయం ప్రకటించారు, ఎన్నికలు పూర్తయిన తర్వాత వరదసాయం ఇంకా ప్రారంభించలేదు. ఎన్నికలు వస్తేనే ప్రజా సంక్షేమం గుర్తొస్తుందా?వరంగల్‌లో కూడా వరదలు వచ్చాయి. అక్కడ ఎన్నికలు లేవని వరద సాయం పంపిణీ చేయలేదు. కరోనా కారణంగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు రోడ్డున పడ్డా వారిని పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఉపఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఉద్యోగుల ఖాళీల భర్తీ ప్రకటన చేశారని అన్నారు. రానున్న అన్ఇన ఎన్నికల్లో గెలవడం ద్వారా కెసిఆర్ ప్రభుత్వానికి చెక్ పెడతామని, ఇందుకు ప్రజలు బిజెపిని ఆశీర్వదించాలని అన్నారు. భాజాపాను ఎదుర్కోలేక తెరాస ఎన్నికల జిమ్మిక్కులు చేస్తోంది. తెలంగాణలో కేసీఆర్–ఒవైసీ చీకటి ఒప్పందాలను బయట పెడతాం. రాబోయే రోజుల్లో నిజాం లాంటి కేసీఆర్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించాల్సిన అవసరముందన్నారు.. తెలంగాణలో కేసీఆర్, ఒవైసీలను రాజకీయ నిరుద్యోగులుగా మార్చాలి. కాంగ్రెస్ పని ఎప్పుడో అయిపోయింది. దానికి డ్రైవర్ లేడు, స్టీరింగ్ లేదు. తెలంగాణలో అధికారంలోకి రాబోయేది భాజపాయే అని మురళీధర్‌రావు అన్నారు. బీజేపీని గెలిపిస్తేనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని మురళీధర్‌రావు చెప్పారు. తెలంగాణలో సాధారణ పరిపాలన పూర్తిగా స్తంభించిందని, ఎన్నికలు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయా అనిపిస్తోందన్నారు. డిసెంబర్ 7 తర్వాత వరద సాయం అన్నారు.. ఏమైంది? అని మురళీధర్‌రావు ప్రశ్నించారు. ఎన్నికలు లేవనే వరంగల్‌లో వరద సాయం ఇవ్వలేదా అని నిలదీశారు. ఉప ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రకటన చేశారని విమర్శించారు. దుబ్బాకలో ఓడిన తర్వాత టీఆర్ఎస్‌లో గెలుపుపై నమ్మకం పోయిందని మురళీధర్‌రావు అన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల ఫలితాల తర్వాత టీఆర్ఎస్‌క